# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 1 మే 2025 ‖సంపుటి:9 ‖సంచిక:124 ‖ పేజీలు:8+4 ‖ వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## కర్రె గుట్టలపై ఎగిరిన జాతీయ జెండా



2

## ధర పెరిగింది డిమాండ్ తగ్గింది



2







# అప్పన్న సన్నిధిలో గోడకూలి ఏడుగురు భక్తుల మృతి

# అపశృతి

- నిజరూప దర్శనం కోసం వచ్చి మృత్యువాత
- భారీ వర్షంతో తడిసిన గోడ కూలడంతో ప్రమాదం
- సహాయ కచర్యలను పర్యవేక్షించిన మంత్రులు
- మృతదేహాలు కెజిహెచ్‌కు తరలింపు
- క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స

## సహాయక చర్యలు చేపట్టిన మంత్రులు అనిత

గోడకూలిన ప్రాంతంలో మంత్రుల పర్యవేక్షణ



## సింహాచలం ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

- మృతులు కుటుంబాలకు సానుభూతి
- 2లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని మోడీ
- ఘటన విచారకరమన్న కిషన్‌రెడ్డి, సిఎం రేవంత్



## ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

- ఘటనపై మంత్రులు.,అధికారులతో టెలికాన్ఫరెన్స్
- సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ప్రకటన
- ప్రమాదంపై విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ
- 78 గంటల్లో నివేదిక ఇవ్వాలని సిఎం ఆదేశం



2

## భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా అలోక్ జోషి



ఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించింది. జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని కేంద్రం నియమించింది. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు ఉన్నారు. భారత సైన్యంలో ...మిగతా 2లో

## నీట్ (యూజీ) అడ్మిట్ కార్డులు విడుదల

**అమరావతి:** మే 4న దేశ వ్యాప్తంగా జరగనున్న నీట్ (యూజీ) పరీక్షకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల సిటీ ఇంటిమేషన్ స్లిప్పులు జారీ చేసిన అధికారులు.. తాజాగా అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 4న దేశ వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష జరగనున్న విషయం తెలిసిందే.

నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు 011-40759000/011-69227700 నంబర్లకు లేదా ne25netug20ta.ac.inకు ఈ మెయిల్ చేయడం ద్వారా సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

# దేశవ్యాప్తంగా కులగణన

## జనాభా లెక్కల సేకరణలో ఈ వివరాలు కూడా తీసుకుంటరు



- లోపభూయిష్టంగా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాల సర్వేలు
- కేంద్ర గణాంకాలతోనే సామాజిక సమతుల్యత సాధ్యం
- చెరకు పంటకు కనీస మద్దతు ధర పెంపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం దాడి నేపథ్యంలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ దేశ రక్షణతో పాటు దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వీటిలో అన్నిటికన్నా రాజకీయ ప్రాధాన్యత కలిగిన అంశం కుల గణనకు సంబంధించినది. త్వరలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనాభా లెక్కల్లో భాగంగా కుల గణన కూడా చేస్తామని కేంద్రం పేర్కొంది. పారదర్శకంగా కులగణన జరగాలని కేంద్రం భావిస్తోంది. ఇందు కోసం సర్వేలపై ఆధారపడకుండా జనాభాలెక్కలలోనే ఈ విషయం నిర్ధారణ చేసుకుంటే సామాజిక సమతుల్యతకు ఆస్కారం లభిస్తుందని కేంద్రం నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ సర్కార్లు తీసుకొచ్చే సర్వేలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీని వల్ల సమాజ శ్రేయస్సు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. తదుపరి జనాభా లెక్కల్లో కుల సర్వేను కూడా చేర్చాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. 'రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది' అన్నారు. కుల గణనను రాజకీయం చేసినందుకు ఆయన కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటకలో నిర్వహించిన సర్వేలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమన్న ఆయన.. 'కాంగ్రెస్ దాని కూటమి భాగస్వాములు కుల గణనను రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించుకున్నాయని అందరికీ తెలుసు. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించడానికి సర్వేలు నిర్వహించాయి. కొన్ని రాష్ట్రాలు దీన్ని బాగా చేశాయి, ...మిగతా 2లో

## తెలంగాణ కులగణన కేంద్రానికి ఓ మోడల్

### కులగణనకు మోడీ సర్కార్ గడువును ప్రకటించాలి



కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. అయితే, కులగణనకు నిర్ణీత గడువు ప్రకటించాలని ఆయన కోరారు. తెలంగాణలో చేపట్టిన కులగణన ప్రక్రియ కేంద్ర కులగణనకు బ్లూప్రింట్ గా ఉంటుందన్నారు. కులగణన దేశంలో సామాజిక సమానత్వం స్థాపిస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ ఓ మోడల్ గా నిలుస్తుందని రాహుల్ ప్రకటించారు.

# సూపర్ క్యాబినెట్ భేటీ

### పుల్వామా ఉగ్రదాడి తరువాత ఇదే తొలి సారి



ఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోడీ పలు కీలక సమావేశాలు నిర్వహించారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీపీఏ) భేటీ జరిగింది. ఆ తరువాత కేబినెట్ సమావేశం కూడా జరిగింది.

**రెండో భేటీ..**

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ ...మిగతా 2లో

# పాక్ సైన్యానికి భారత్ వార్నింగ్

ఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ క్రమంలో భారత్, పాక్ లకు చెందిన మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు హాట్ లైన్ లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం కాల్పులకు పాల్పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన భారత్ ఆ దేశాన్ని ...మిగతా 2లో

# వైభవంగా దేవినేని కుమారుడి వివాహం

### వధూవరులను ఆశీర్వదించిన రేవంత్

**విజయవాడ:** తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు-తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.



# మోహన్ బాబుకు సుప్రీం షాక్

- ఉల్లంఘన కేసులో స్టేకు నిరాకరణ



**న్యూఢిల్లీ:** సినీనటుడు మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది.. 2019 ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసులో స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.. అయితే, ఈ కేసు విచారణకు హాజరుకాకుండా స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్‌లో దాఖలు చేశారు ...మిగతా 2లో

# సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

**అమరావతి:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడినట్లు చెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించామన్నారు. సహాయకచర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి కేజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు పోలీసులు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మరోవైపు సింహాచలం ఘటన పై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, గాయపడిన వారికి రూ.3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవస్థాన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయంపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆయన ఆదేశించారు. మరోవైపు గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ-లో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# అప్పన్న సన్నిధిలో అపశృతి

**విశాఖపట్నం:** సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో అపశృతి చోటుచేసుకుంది. రూ. 300 టికెట్ కౌంటర్ దగ్గర గాలి, వానకు గోడ కూలిపోయింది.ఈ ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. సంఘటన ప్రదేశానికి చేరుకున్న సహాయకసిబ్బంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించారు. వెంటనే మృతదేహాలను కేజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. సింహాచలం చందనోత్సవం వేళ భారీ వర్షం కురియడంతో గోడ కూలింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ప్రసాదం స్కీం కింద అక్కడ గోడ నిర్మించారు. అక్కడ అభివృద్ధి పనులు చేస్తున్నారు. అందులో భాగంగా గోడ కట్టారు. ఆ గోడ పక్కనుంచే రూ. 3 వందల టిక్కెట్ లైన్ ఉంది. బుధవారం తెల్లవారుజాము 2:30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గోడ కూలింది. ఆ ప్రక్క నుంచి క్యూ లైన్ నుంచి వెళుతున్న భక్తులపై గోడ పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందినట్లు- సమాచారం. క్షతగాత్రుల తరలింపుకు 17 అంబులెన్సులు ఏర్పాటు చేశారు. సహాయక చర్యలు




కొనసాగు తున్నాయి. వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రొటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందిన వారు. మృతుల వివరాలు..ఇలావున్నాయి. పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా, ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం, కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పు గోదావరి జిల్లా, గుజ్జరి మహాలక్ష్మి (65), హెచ్‌బీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పిళ్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం, పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం.

## ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ:** సింహాచలం అప్పన్న చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన ఘటనపై రాష్ట్రపతి ద్రౌది ముర్ము,ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనుకోని ఘటనలో ఏడుగురు మృత్యువాత పడడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలుపుతూ వారికుంబాలకు సానుభూతి ప్రకటించారు.. ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోడీ రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు. సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలి.. పలువురు మృతిచెందిన ఘటనపై పార్లమెంట్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. పలువురు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికిగురిచేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేసినట్లు సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ఆయన పేర్కొన్నారు. సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన ఘటనలో పలువురు మృతి చెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన అక్షయతృతీయ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు రావడం, ఈ సందర్భంలో గోడ కూలి ప్రాణనష్టం జరగడం విచారకరమని అన్నారు. మృతుల కుటు-ంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదో దురదృష్టకర ఘటన అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢసానుభూతి తెలియచేశారు.

## సింహాచలం ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

**విశాఖపట్నం:** సింహాచలంలో గోడకూలిన ఘటనపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలులకు గోడ కూలి ఏడుగురు భక్తులు చనిపోవడం, పలువురు గాయపడడం తీవ్రంగా బాధించిందన్నారు. గోడ కూలిన ప్రాంతంలో సహాయక చర్యలను మంత్రులు, అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నామని, చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని



మంత్రి చెప్పారు. భక్తులు భయపడాల్సిన అవసరం లేదని, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పెద్ద ఎత్తున సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయన్నారు. సింహాచలంలో గోడకూలిన ఘటన స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నామని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలిందన్నారు. ఎన్టీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖ సిబ్బంది నేతృత్వంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని హోం మంత్రి తెలిపారు.

## ధర పెరిగింది.. డిమాండ్ తగ్గింది..

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** అధిక ధరల కారణంగా బంగారం డిమాండ్ పడిపోతోంది. జనవరి-మార్చి మధ్య కాలంలో డిమాండ్ 15 శాతం పడిపోయి, 118.1 టన్నులకు చేరిందని బుధవారం ప్రపంచ స్వర్ణ మండలి తెలియజేసింది. ధరలు ఎక్కువగా ఉండటంతో విలువపరంగా చూసుకుంటే 22 శాతం పెరిగినప్పటికీ డిమాండ్ మాత్రం తగ్గింది. 2025 భారత్‌లో పసిడి డిమాండ్ 700 టన్నుల నుంచి 800 టన్నుల మధ్యలో ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనాకట్టింది.

## మోటకొండూరు పేలుడు.. మృతుల కుటుంబాలకు కోటి రూపాయిల పరిహారం

### కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం

**భువనగిరి, ఏప్రిల్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న జరిగిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటన మృతుల కుటుంబాలకు ప్రీమియర్ ఎక్స్‌ప్లొజివ్ కంపెనీ పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అలాగే, బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో శాశ్వత ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వడానికి అంగీకరించింది. యాదాద్రి జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్ ప్లొజివ్స్ లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసరకును ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఘటన ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# దేశవ్యాప్తంగా కులగణన

(మొదటి పేజీ తరువాయి)

మరికొన్ని రాష్ట్రాలు పారదర్శకంగా లేని విధంగా రాజకీయ కోణం నుండి మాత్రమే ఇటువంటి సర్వేలను నిర్వహించాయి. ఇటువంటి సర్వేలు సమాజంలో సందేహాలను సృష్టించాయి. మన సామాజిక నిర్మాణం రాజకీయాల వల్ల చెదిరిపోకుండా చూసుకోవడానికి, సర్వేలకు బదులుగా కుల గణనను జనాభా గణనలో చేర్చాలి' అని మంత్రి అన్నారు. కులాల జనాభా లెక్కించి ఆ సంఖ్య ఆధారంగా సంక్షేమ పథకాలు అందించాలని విపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కొంత కాలంగా కోరుతున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది.

**చెరకు పంటకు కనీస మద్దతు ధర పెంపు..**

కుల గణనకు సంబంధించిన అంశంతోపాటు కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. సిల్చార్- షిల్లాంగ్ హైస్పీడ్ కారిడార్ కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసోం- మేఘాలయా మధ్య కొత్త హైవేకు అనుమతిచ్చింది కేంద్ర క్యాబినెట్. చెరకు రైతులకు కనీస మద్దతు ధర పెంపుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.



## మోహన్ బాబుకు సుప్రీం షాక్

(మొదటి పేజీ తరువాయి)

మోహన్‌బాబు.. మే 2న విచారణాధికారి ముందు ఖచ్చితంగా హాజరు కావాలని జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.. ఇక, ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.. ధర్నా జరిగినప్పుడు వ్యక్తిగతంగా అక్కడ ఉన్నారు కదా..? అని మోహన్‌బాబు తరపు న్యాయవాదిని జస్టిస్ బేలా త్రివేది ప్రశ్నించారు.. అయితే, తాను కాలేజీ నడుపుతున్న 75 సంవత్సరాల వ్యక్తి అని.. ప్రైవేట్ వ్యక్తులపై ఎన్నికల ప్రవర్తనా నియామవాళి వర్తించదని మోహన్ బాబు వాదించారు.. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం తాము చేసిన ధర్నా ఎంసీసీ పరిధిలోకి రాదని.. చార్జ్‌షీట్‌లోనూ ఎంసీసీ ఉల్లంఘన కేసు తమపై మోపారని సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు.

## కర్రెగుట్టలపై ఎగిరిన జాతీయ జెండా

**ఖమ్మం, ఏప్రిల్ 30:** ఇంతకాలం మావోయిస్టులకు ఆశ్రయమిచ్చిన తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్ట కొండను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ ప్రాంతాన్ని నక్సల్స్ నుంచి విముక్తి చేస్తూ... తమ విజయానికి చిహ్నంగా కొండ పైభాగంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇందుకు సంబంధించిన దళాలు స్క్రీన్‌షాట్‌ను విడుదల చేశాయి. బుధవారంతో యాంటీ నక్సల్స్ ఆపరేషన్ తొమ్మిదో రోజుకు చేరింది. ఎయిర్ డ్రాప్ ద్వారా కమాండోలు కొండపైకి చేరుకుని ఆపరేషన్ చేపట్టారు. వివిధ యూనిట్లకు చెందిన సుమారు 24,000 మంది భద్రతా సిబ్బంది ఈ ఆపరేషన్లో పాల్గొన్నారు. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీసు విభాగాలు, సీఆర్పీఎఫ్, ఎలైట్ కమండో బెటాలియన్స్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) కమెండోలో ఈ ఆపరేషన్లో పాల్గొన్నారు.

# పాక్ సైన్యానికి భారత్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పాకిస్థాన్ కూడా గగనతలాన్ని నిఘాను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే లాహోర్, కరాచీ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని స్కర్దు, గిల్గిత్ కు నడిచే విమాన సర్వీసులను పీఐఏ నిలిపివేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వీటితోపాటు స్థానికంగా అన్ని విమానాశ్రయాలకు హై అలర్ట్ ప్రకటించినట్లు సమాచారం.

**భారత్ ఏ క్షణమైనా సైనిక దాడి జరపొచ్చు..**

ఈ పరిణామాల వేళ పాక్ మంత్రి ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 24-36 గంటల్లో తమ దేశంపై సైనిక చర్య చేపట్టేందుకు న్యూఢిల్లీ ప్రణాళికలు రచిస్తోందన్నారు. దీనికి సంబంధించి తమకు కచ్చితమైన నిఘా సమాచారం ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామంటూ భారత ప్రధాని మోడీ వెల్లడించిన వేళ పాక్ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకుంటున్న ప్రతిచర్యలపై పాక్ సమాచార శాఖ మంత్రి అతవుల్లా తరార్ అక్కసు వెళ్లగక్కారు. ఈక్రమంలోనే న్యూఢిల్లీపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేగాక, తాము కూడా ఉగ్రవాద బాధితులమేనంటూ మొసలి కన్నీరు కార్చారు. పహల్గాం దాడిపై తటస్థ, పారదర్శక, స్వతంత్ర దర్యాప్తునకు సహకరిస్తామని తాము ఇప్పటికే ప్రకటించామన్నారు. అయినా సరే.. భారత్ తమపై సైనిక చర్యకు సిద్ధమవుతోందని ఆరోపించారు. దీనికి తమ నుంచి ప్రతిచర్య తీవ్రంగా ఉంటుందన్నారు.



## భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా అలోక్ జోషి

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ బి.వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇదిలా ఉంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే అని నిన్న జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ స్వేచ్ఛ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని మట్టి కరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని అన్నారు. అలాగే ఈ రోజు వరుస భేటీలకు అధ్యక్షత వహించడం చూస్తుంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

# సూపర్ క్యాబినెట్ భేటీ



(మొదటి పేజీ తరువాయి)

కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్ర ఘుటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిసాన్ కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదా రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్ జరిపిన విషయం విదితమే. ఈ విధంగా అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లోకి దూస్కపోయిన కారు..

## ఐదుగురు వైద్య విద్యార్థులు సహా ఆరుగురి మృతి

**నెల్లూరు, ఏప్రిల్ 30:** నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఆరుగురు మృతి చెందారు. . ముంబయి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చిరెడ్డి పాలెంలో తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి



తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

**సీఎం విచారం..**

ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఐదుగురు వైద్య విద్యార్థులు, మరో వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా పూర్తి ఏర్పాట్లు

- **జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు**

**తిరుపతి ఏప్రిల్ 30 మనం న్యూస్ :** జిల్లాలో మే 4న నీట్ యూజీ- 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి జి నరసింహులు సంబందిత అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫిరెన్స్ హాలు లో నీట్ యూజీ- 2025 పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నీట్ సిటీ కోఆర్డినేటర్ హేమంత్ పాండ్య, జిల్లా అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి లతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి జి నరసింహులు మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం పది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గూడూరు నందు ఒక పరీక్ష కేంద్రం, తిరుపతి జిల్లా కేంద్రంలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 4489 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్లో విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని సూచించారు. పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.




నీట్ యూజీ నియమ నిబంధనలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు హాజరగు అభ్యర్థులు సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేవని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులైన టాయిలెట్స్, త్రాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులను ఉదయము మరియు సాయంత్రం సమయాలలో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది తో పాటు, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద జనం గుమి కూడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష జరుగు కేంద్ర సమీపంలో ఎక్కడ కూడా జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

తిరుపతి నగర పరిధిలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు :

1. శ్రీ పద్మావతి గరల్స్ హై స్కూల్, వెస్ట్ చర్చి రోడ్, బాలాజీ కాలనీ, తిరుపతి.
2. పీఎం కేంద్రీయ విద్యాలయ నెంబర్ 1, తిరుపతి, హరే కృష్ణ రోడ్, యం సి ఆర్ కాలనీ, తిరుపతి
3. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఉమెన్స్ యూనివర్సిటీ) శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎగ్జామినేషన్ హాల్, పద్మావతి నగర్, తిరుపతి
4. ఎస్.జి.ఎస్ ఆరట్స్ కాలేజ్ (ఆటానమస్) నియర్ లక్ష్మీపురం సర్కిల్ తిరుచానూర్ రోడ్, తిరుపతి
5. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ (టీటీడీ) వింగ్ -ఏ, ఎస్ వి యూనివర్సిటీ నియర్ శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ తిరుపతి
6. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ అండ్ పీజీ కాలేజ్ (టిటిడి) వింగ్ - బి, ఎస్ వి యూనివర్సిటీ పద్మావతి గెస్ట్ హౌస్ తిరుపతి
7. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ హై స్కూల్, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ తిరుపతి
8. శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ (టిటిడి) నియర్ సంస్కృత విద్యాపీఠం, ఎల్ఐసి రోడ్, బాలాజీ కాలనీ తిరుపతి
9. ఎస్ వి ఆరట్స్ కాలేజ్ (టిటిడి) వింగ్ ఏ, ఎస్ వి ఆరట్స్ కాలేజ్ (టీటీడీ) వింగ్ - ఏ, బాలాజీ కాలనీ తిరుపతి
10. డి ఆర్ డబ్ల్యు జూనియర్ కాలేజ్, గూడూర్, జడ్పీ హైస్కూల్ రోడ్, గూడూరు.

ఈ సమావేశంలో వైద్య శాఖ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, చీఫ్ సూపరింటెండెంట్స్,విద్యా శాఖాదికారులు, నీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మే 4 న ప్రశాంత వాతావరణంలో నీట్ - 2025 పరీక్షల నిర్వహణ




- **పరీక్షలకు హాజరు కానున్న 710 మంది విద్యార్థులు**
- **జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరు, ఏప్రిల్ 30 మనం న్యూస్ :** మే 4న జరగనున్న నీట్ - 2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నీట్ - 2025 ప్రవేశ పరీక్షల నిర్వహణ పై రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య, అగ్నిమాపక శాఖ, ఆర్టీసి, ఇతర సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలు,జేసి జి.విద్యాధరి లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంబిబిఎస్, బిడిఎస్, బిఏఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాల కొరకు NTA (National Testing Agency) నిర్వహిస్తున్న NEET (National Eligibility cum Entrance Test) పరీక్షలు జిల్లా కేంద్రంలోని పివికేఎన్ డిగ్రీ కళాశాల నందు (432 మంది) మరియు సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల(278మంది) ల్లో మే 4న ఆదివారం మధ్యాహ్నం 2.00 గం.ల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద, ప్రశ్నా పత్రాలు భద్రపరచే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేయాలని పోలీస్ ఎస్కార్ట్ ల సహాయంతో ప్రశ్నా పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని, జనరేటర్ లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్షా సెంటర్లకు నిర్దేశించిన ప్రాంతం అవతల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండడానికి షామియానా, నీటి వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

పరీక్షలకు హాజరగు విద్యార్థులు సరియైన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా హాల్ లో సిసి కె మెరాలు ఏర్పాటు చేయాలని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్ లు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవ నిమిత్తం ఆంబులెన్స్, ఫైర్ ఇంజిన్ ఏర్పాటు ఉండాలన్నారు. పరీక్షా హాలులోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు మొబైలు ఫోన్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. మొబైలు ఫోన్ లను భద్రపరచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం లో రెవెన్యూ తరపున, పోలీస్ తరపున ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సీటింగ్ అరేంజ్మెంట్ లు పకడ్బందీగా చేయాలని, లైట్ లు, ఫ్యాన్ లు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఎస్ పి మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలను ఆరమ్డ్ పోలీస్ లతో కూడిన ఎస్కార్ట్ తో పరీక్షా కేంద్రాలకు తరలించాలని, దీన్ని పూర్తి స్థాయిలో వీడియో గ్రఫీ, ఫోటోగ్రఫీ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్ కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ జామ్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశానికి డిఆర్ఓ కె.మోహన్ కుమార్, డిఈఓ వరలక్ష్మి, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రకు వెళ్లే వారి సౌకర్యాల కల్పనకు పెద్దపీట

- **ఎపి నుంచి వేళ్ళేవారికి బెంగుళూరు, హైదరాబాదు విమానాశ్రయాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం**
- **హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్**



మదనపల్లి, ఏప్రిల్ 30, మనం న్యూస్ : ఏపీ నుంచి హజ్ వెళ్ళే యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ముఖ్యంగా రాయలసీమ వాసులకు బెంగుళూరు, హైదరాబాదు విమానాశ్రయాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్ ప్రకటించారు. రాష్ట్ర హజ్ కమిటీ సభ్యునిగా పఠాన్ ఖాదర్ ఖాన్ బుధవారం హజ్ కమిటీ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, కేంద్ర హజ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్రకు సంబంధించి రాష్ట్ర హజ్ కమిటీ సభ్యునిగా తనను నియమించిన సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,, రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫారూక్, ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి నోడల్ అధికారులను నియమించడం, స్పష్టమైన పికప్, డ్రాప్-ఆఫ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సహాయ సేవలు ఏర్పాట్లు పకడ్బందీగా చేయడానికి కృషి చేస్తామని ప్రకటించారు. పురుషులు, మహిళల కోసం వేర్వేరు వసతి కేంద్రాలు, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజన వసతి, తాగునీటి సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని వాగ్దానం చేశారు. విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడానికి ఏపీ నుంచి 1630 మంది హజ్ యాత్రకు ఈ ఏడాది వివిధ దశల్లో హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి బయలుదేరుతున్నారని, వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టి వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# సింహాచలం అప్పన్నకు టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాల సమర్పణ

**తిరుమల, ఏప్రిల్ 30, మనం న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన విశాఖపట్నం సమీపంలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి(అప్పన్న) టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు.



టీటీడీ 1996వ సంవత్సరం నుంచి టీటీడీ తరుపున శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దేశంలోని అన్ని నరసింహస్వామి క్షేత్రాల్లో సింహాచలం అతి ప్రాచీనమైనదని, స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు.

సింహగిరిపై కొలువైన సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేకువజామున వైభవంగా ప్రారంభమైంది. సింహాచలం అప్పన్న విగ్రహం ఏడాది పొడవునా చందనంతో కప్పి ఉంటుంది. సంవత్సరంలో 12 గంటలు మాత్రమే చందనం పూత లేకుండా స్వామివారు దర్శనమిస్తారు. పవిత్రమైన అక్షయతృతీయ రోజున స్వామివారి విగ్రహానికి చందనం పూత తొలగించి తిరిగి పూస్తారు. చందన యాత్ర లేదా చందనోత్సవం పేరిట ప్రతి ఏటా వైశాఖమాసంలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వరస్వామివారి తరపున టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బొక్కసం ఇన్ ఛార్జ్ గురు రాజ్ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తి ఉద్యమంతో సంఘాన్ని సంస్కరించిన రామానుజాచార్యులు

- **టీటీడీ తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి**
- **శ్రీ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ప్రారంభం**




తిరుపతి, ఏప్రిల్ 30 మనం న్యూస్ : భక్తి ఉద్యమంతో సమానత్వాన్ని బోధించి సమాజాన్ని సంస్కరించిన మహనీయుడు భగవద్ రామానుజాచార్యులని టిటిడి తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి ఉద్ఘాటించారు. టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శ్రీ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. మే 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి.

ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ, ఆదిశేషుని అవతారమైన భగవద్ రామానుజులు శరణాగత భక్తిని విశేషంగా ప్రచారం చేశారని, శరణాగతి భక్తితో భగవంతుని కొలిస్తే దివ్యత్వం కలుగుతుందని అన్నారు. శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు పాన్పుగా, ఆసనంగా ఉంటూ ప్రథమ సేవకుడిగా నిలిచాడని, భగవద్ రామానుజులు ఈ మార్గాన్నే అనుసరించారని వివరించారు. శ్రీ రామానుజార్యుల అవతార మహోత్సవాలను టీటీడీ ఘనంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం అహోబిలం మఠంకు చెందిన సీతారామన్ శ్రీ రామానుజ వైభవంపై ఉపన్యసించారు. ఆ తరువాత అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సరస్వతి ప్రసాద్ బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి రాజగోపాల రావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పురుషోత్తం, పురప్రజలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతోనే ముగ్గురు భవననిర్మాణ కార్మికుల దుర్మరణం

- **ఒక్కొక్కరికి రూ 5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి**
- **సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డిమాండ్**



**తిరుపతి, ఏప్రిల్ 30 మనం న్యూస్ :** తిరుపతి మంగళం సమీపంలోని తుడా క్వార్టర్స్ వద్ద అక్రమంగా భవన నిర్మాణం జరుగుతున్నా నగరపాలక సంస్థ, తుడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే ముగ్గురు భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం, ఐఎఫ్టీయు తిరుపతి నగర కన్వీనర్ పి.లోకేష్ లు విమర్శించారు. జి+3 కి అనుమతి తీసుకుని ఐదు అంతస్తుల భవనం కడుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వారు ఈ అక్రమ నిర్మాణాన్ని గుర్తించి స్పందించి ఉంటే భవన నిర్మాణ కార్మికులు మేస్త్రి శ్రీనివాసులు, కుంచాల శ్రీనివాసులు, తన్నీరు వసంత్ ప్రాణాలకు కోల్పోయేవారు కాదని తెలిపారు. భవన నిర్మాణ సమయంలో కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన కనీస చర్యలు ఏవి ఇక్కడ కనిపించడం లేదని అన్నారు. మృతి చెందిన కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని, అక్రమ నిర్మాణాన్ని పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, భవన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



# కన్నుల పండుగగా మూడవ రోజు అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు

**రంగారెడ్డి, ఏప్రిల్ 30 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ వాసవి కాలనీ లోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవములలో భాగంగా మూడవ రోజు వైశాఖ శుద్ధ తదియ బుధవారం రోజున నృసింహ ఇష్టి, సూర్య ప్రభ వాహనసేవ, గజవాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, ఎదురుకోలు ఉత్సవం లు కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్తా లు తెలియజేశారు.

ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరీశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, శ్రీధర్, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం మృతులకు నివాళి



- **బుద్వేల్ గ్రామ సాయికృష్ణ వాసుల క్యాండిల్ ర్యాలీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా బుద్వేల్ గ్రామానికి చెందిన సాయి కృష్ణ కాలనీవాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాలనీ సంఘం అధ్యక్షుడు బి శ్రీనివాస్ (కాక) నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో భూపాల్ రెడ్డి, రంగస్వామి, రామ్ రెడ్డి, ప్రమీల, ఆర్టీసీ నాగరాజు ,వెంకటేష్ గౌడ్, కోటేశ్వరరావు, నగేష్, ఉచ్చిరప్ప, శ్రీ రామకృష్ణ, మూర్తి, హనీఫ్, ప్రతాప్, నర్సింగ్ రావు, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'భారత్ మాతా కీ జై' నినాదాలిచ్చారు.

మనం Manam Editorial
సంపాదకీయం

## ఎండ పాపం..

నిప్పుల కొలిమిగా మారుతున్న
ఎండ తాపంలో అసలు తాకిడెంత?
ఎండ తాపమా! పెరిగిన పాపమా!
ఏమిటి ఈ వైపరీత్యం?
ఎందుకు ప్రకృతి మరో చూపు?
ఇప్పటికైనా తెలియదా
ఇకనైనా తెలుసుకో ఓ నరుడా...
అందుకే మొక్కలు నాటు ఇప్పుడే!
పచ్చదనంతో సస్యశ్యామలం
కావాలి ఇక జగమంతా!
చల్లని గాలులే వడగాలులకు
అడ్డుగా నిలిచి కొంతైనా, మరి కొంతైనా....
మార్పుకై ఎంతలో కొంతైనా
నీ వంతు నెరవేర్చుమా....

**- డా. చిటికెన కిరణ్ కుమార్**
9490841284

## జిందాబాద్

లంచం కల్తీ
రెండు రాచపుండ్లు
పుండ్లకు మందవసరం
పుండ్లకు శస్త్రచికిత్స
అవసరం...
తర్జన భర్జనల మధ్య
ఇష్టానుసారంగా
రాచపుండ్లు
వర్ధిల్లు తునే ఉన్నాయి
చచ్చేది
సామాన్య జనం...
మందే లేదా, మార్పే రాదా
జవాబు కాలమే చెబుతుంది
పోరాటం సాగుతునే ఉంటుంది

**- రేడియమ్**
9291527757

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# శ్రమైక జీవన సౌందర్యానికి సమానమేదీ?



ప్రజా ప్రయోజనాలను ఆశించి జరిగే ఏ ఉద్యమమైనా విజయవంతమవుతుంది. స్వీయ ప్రయోజనాల కోసం,రాజకీయ ప్రయోజనాల కోసం జరిపే కృత్రిమ ఉద్యమాలు విఫలమవుతాయి. ఎన్నో ప్రసార,ప్రచార, సాంఘిక మాధ్యమాలు వెల్లువెత్తిన వర్తమానంలో జరిగే ఏ ఉద్యమాన్నైనా ప్రజలు నిశితంగా పరిశీలిస్తారు. నిజమైన ఉద్యమంలో నిస్వార్ధం,త్యాగశీలత,విశాలమైన ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉంటాయి. ఉద్యమం అంటేనే ఒక ఉన్నత మైన లక్ష్యం కోసం జరిపే పోరాటం. ఎన్నో ఉద్యమాలు ప్రపంచ ప్రజల స్థితిగతులను సమూలంగా మార్చేశాయి. ప్రజాజీవితంలో పెను మార్పులు తీసుకు వచ్చాయి. అలాంటి ఉద్యమాల్లో కార్మిక ఉద్యమం ప్రధానమైనది.ఐరోపాలో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం ప్రపంచ కార్మికుల ఆలోచనలను ప్రభావితం చేసింది.తదనంతరం జరిగిన యాంత్రీకరణ వలన పరిశ్రమల స్థాపనకు బీజం వేసింది. ఉపాధి అవకాశాలు పెరిగాయి. కార్మిక సంఘాలు వెలిశాయి. హక్కుల కోసం నినదించాయి. కార్మిక సంక్షేమ పథకాలు,కార్మిక చట్టాలు చేయబడ్డాయి.ప్రపంచ శ్రామిక చరిత్రలో 1886 వ సంవత్సరం మే 1 వ తేదీకున్న ప్రాధాన్యత మరవలేని,మరపు రాని జ్ఞాపకం. అమెరికా లోని చికాగో హే మార్కెట్ స్క్వేర్ లో కార్మిక ఉద్యమ కారులపై జరిగిన హింసాకాండ ప్రపంచ శ్రామికులను జాగృతం చేసింది. ప్రపంచమంతా కార్మికులకు సంఘీభావం తెలిపింది. నాటి సంఘటనకు గుర్తుగా ప్రతీ ఏటా మే1 వ తేదీ ని ప్రపంచ కార్మిక దినోత్సవం( మేడే) గా జరుపుకుంటున్నారు.ఐరోపా దేశాల్లో పాటించిన మే డే ని కాలక్రమంలో పలుదేశాల్లో పాటించడం జరుగుతున్నది.భారత దేశంలో 1923 వ సంవత్సరం నుండి 'మేడే' ఉత్సవాలు జరుగుతున్నాయి.గతం కార్మిక జీవితంలో ఒక శాపం. ఎన్నో అవమానాలు,ఆక్రందనలు శ్రామిక వర్గపు ఆలోచనలను ఉద్యమాలవైపు పురిగొల్పాయి. ఉద్యమాల ఫలితంగా శ్రామిక జీవుల కష్టం ఫలించింది. 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చింది. కాలచక్ర భ్రమణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుత ఆధునిక ఆర్థిక వ్యవస్థ పలు మార్పులు సంతరించుకుంటున్నది. సరళీకృత ఆర్థిక విధానాల వలన ప్రైవేటీకరణ శకం ప్రారంభమైనది.యాంత్రీకరణ ఉపందుకుంటున్నది. ఈ పరిణామాలు శ్రామిక వర్గంపై పెను ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ యుద్ధాల కారణంగా అప్పట్లో ఆర్థికమాంద్యం విలయ తాండవం చేసింది. వర్తమానంలో యుద్ధాలతో పాటు ప్రపంచ దేశాలను వాణిజ్య పరమైన సుంకాలు, ఆర్థిక మాంద్యం పట్టిపీడిస్తున్నాయి. ఆయుధాలు అవసరం లేని సాంకేతిక యుద్ధం కూడా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నది. ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యం వైపు నెట్టబడ్డాయి. జనాభా లో అతి పెద్ద దేశ మైన భారత్ కూడా పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నది.



బాలకార్మిక వ్యవస్థ కూడా పలు దేశాలకు శాపంలా మారింది. మే డే సందర్భంగా ఈ విషయం పై అన్ని దేశాలు స్పందించాలి. ఆధునిక నాగరిక ప్రపంచంలో బాలకార్మిక వ్యవస్థ అమానవీయం,అనైతికం. బాలలను అనైతిక పద్దతుల్లో వివిధ రకాల పనుల్లో నియమించుకుని వారి పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ, శారీరక,మానసిక హింసలకు గురిచేస్తూ,విద్యకు,మానసిక వికాసానికి దూరంచేస్తూ వారి హక్కులను హరిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడమే బాల కార్మిక వ్యవస్థ ప్రధానోద్దేశ్యం. బాల కార్మిక వ్యవస్థ లో చోటుచేసుకుంటున్న అవాంఛనీయ పరిణామాలు సభ్య సమాజానికే సిగ్గుచేటు.బాల కార్మిక వ్యవస్థ మానవ హక్కుల ఉల్లంఘున లో మరో మైలురాయి. చట్టాలను అతిక్రమిస్తూ,పరిపక్వత లేని వయసులో మానసిక,శారీరక వేధింపులకు గురిచేస్తూ బాలల చేత వెట్టి చాకిరీ చేయించే అమానుషమైన చట్ట వ్యతిరేక యంత్రాంగాన్ని ' బాలకార్మిక వ్యవస్థ' అని నిర్వచించవచ్చు. పేదరికమే బాలకార్మిక వ్యవస్థ కు మూలకారణమని చెప్పవచ్చు. కుటుంబాలలోని వ్యక్తుల ఆదాయం స్వల్ప స్థాయిలో ఉండడం,పెద్దల సంపాదన కుటుంబ అవసరాలను తీర్చలేకపోవడం వంటి పరిస్థితుల కారణంగా తమ సంపాదనకు మార్గాలను అన్వేషించే ప్రక్రియలో భాగంగా తల్లిదండ్రులు బాలలను వివిధ పనుల్లో నియమించడం జరుగుతున్నది. ఇలాంటి చర్యల వలన బాలల ఉజ్వల భవితవ్యం దెబ్బతింటున్నది. ఆర్థిక అంతరాలు శ్రమ జీవులకు,మధ్య తరగతి,చిరువేతన జీవులకు శాపంగా మారడం విదితమే. కోవిడ్ సమయంలోను,యుద్ధాల సందర్భంలోను కార్మికులు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం. ఉద్యమాలు కార్మికుల భవిష్యత్తుకు బాటవేయాలి. అనవసరమైన ఉద్యమాలు, ప్రచారం కోసం జరిగే రెచ్చగొట్టే సభల వలన కార్మిక లోకానికి ఇప్పటికే ఎంతో నష్టం జరిగింది. నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలు కార్పోరేట్ గుప్పిట్లోకి పోవడం పెనువిపత్తుకు సంకేతం. శ్రమ శక్తిని నమ్ముకోవాలి. కష్టించి పరిశ్రమలను నిలుపుకోవాలి. లాభాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదు. ఇదే సందర్భంలో నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు నిలదొక్కుకోవాడానికి, లాభాల బాట పట్టడానికి తగినంత కాలవ్యవధినివ్వాలి. ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును కాపాడు కోవాలి. కేంద్ర ప్రభుత్వం కూడా తెలుగు ప్రజల మనో భావాలకు దర్పణంగా నిలుస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా చూడాలి. విశాఖ ఉక్కుకు ఆర్థిక సహాయం చేయడం హర్షదాయకం. అదే విధంగా ప్రైవేటీకరణ పై కేంద్రం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకుని దీనిని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలి. విశాఖ ఉక్కుకు స్వంత గనులు కేటాయించాలి.మొక్కవోని దీక్షతో విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమిస్తున్న కార్మికులకు రాజకీయాలకు అతీతంగా సంఘీభావం తెలపాలి. మేడే ఉద్యమ స్ఫూర్తి కార్మికుల జీవితాల్లో వెలుగు రేఖలు పూయించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలి. ఇదే సందర్భంలో కార్మికులంతా ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాటలో నడపాలి.

('మే డే' సందర్భంగా)
**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# శ్రామిక శక్తికి నూతన దిక్సూచి



ప్రపంచవ్యాప్తంగా మే 1, 2025న 103వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విశేష ఉత్సాహంతో, శ్రామికుల గౌరవార్థంగా ఘనంగా



జరుపుకోనున్నారు.ఇది కేవలం సెలవుదినం కాదు - ఇది శ్రమదానం చేసిన వారికి, సమానత్వం కోసం పోరాడిన వారికి అంకితం చేయబడిన రోజు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన హేమార్కెట్ ఉద్యమం ద్వారా ఈ దినోత్సవానికి పునాది పడింది. అప్పటి నుంచి మే డే అనేది కార్మికుల హక్కుల గుర్తింపుకు, సంఘీభావానికి, సామాజిక న్యాయానికి నిలువెత్తు చిహ్నంగా నిలుస్తోంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో మే డేను సాంస్కృతికంగా, రాజకీయంగా తమ స్వంత అవసరాలకు అనుగుణంగా జరుపుకుంటారు. భారత్లో ఈ దినోత్సవం అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా గుర్తింపు పొందింది. వివిధ రంగాల్లోని కార్మికులు-గొప్ప సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు నుండి దినసరి కూలీల వరకూ-ఈ రోజు ఒకే ప్లాట్ఫాం నిలిచి, సంఘీభావాన్ని వ్యక్తం చేస్తారు. కార్మికుల గౌరవార్థం సమావేశాలు, ర్యాలీలు, కళాపరమైన ప్రదర్శనలు జరుగుతుంటాయి.

ఈ సంవత్సరం మే డే, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీ వంటి ఆధునిక ఆవిష్కరణల నేపథ్యంలో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. పరిశ్రమలు వేగంగా మారుతున్నాయి. కొన్ని ఉద్యోగాలు పూర్తిగా లేకుండా పోతుండగా, కొన్ని కొత్త ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఈ మార్పులో ముఖ్యంగా శ్రమదారులకు గౌరవం, భద్రత, సముచిత వేతనాల పరిరక్షణ అవసరమవుతుంది. పని పద్ధతుల మార్పుతో పాటు, కార్మికుల హక్కులను రక్షించేందుకు కొత్త ప్రణాళికలు, విధానాలు రూపొందించాల్సిన అవసరం తలెత్తుతోంది.

ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు యుగంలో గౌరవభరితమైన పని అనే అంశం మే డే 2025లో ప్రధానంగా ఉత్కృష్టంగా చర్చించబడుతోంది. శ్రమను తగ్గించే టెక్నాలజీ, ఉపాధిని పెంపొందించే డిజిటల్ పరిజ్ఞానం రెండూ కలిసే సమతుల్య విధానం అవసరం. ఇది కేవలం ఉద్యోగ భద్రతకే కాక, పని గౌరవానికి, మానసిక ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు కూడా ప్రాధాన్యతనివ్వాలి. ఈ ఆవిష్కరణల వేగాన్ని అనుసరిస్తూనే, సమాజంలో ఉన్న అన్ని వర్గాల కార్మికులకు న్యాయమైన అవకాశాలు కల్పించే దిశగా పాలకులు, పౌరులు చిత్తశుద్ధితో ముందడుగు వేయాలి.

ప్రస్తుత ఉద్యోగ వ్యవస్థ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. గిగ్ ఉద్యోగాలు, రిమోట్ వర్క్, ఫ్రీలాన్సింగ్ వంటివి కొన్ని అవకాశాలు కలిగించినా, వాటి ద్వారా శ్రమదారులకు మౌలిక హక్కులు లభించకపోవచ్చు. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఆరోగ్య బీమా, పని గంటలు వంటి విషయాలు అస్పష్టంగా మారుతున్నాయి. మానసిక ఒత్తిడి పెరగడం, వ్యక్తిగత జీవితం దెబ్బతినడం వంటి ప్రభావాలు దీని వల్ల చూస్తున్నాం.

ఈ మే డే, శ్రమదారుల భవిష్యత్తు సాధికారత కోసం నైపుణ్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిస్తుంది. వేగంగా మారుతున్న టెక్నాలజీ నేపథ్యంలో, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ, ఉద్యోగ మార్పులకు సన్నద్ధం చేసే కార్యక్రమాలు, వయోజన విద్య, పునఃశిక్షణ వంటి అంశాల్లో కార్మిక సంఘాలు, ప్రభుత్వాలు, విద్యాసంస్థలు సమగ్రంగా చురుకుగా వ్యవహరించాలి. ఉద్యోగం కోల్పోయే అవకాశమున్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను అందించేందుకు అంతర్నిర్మిత విధానాలతో సమన్వయంగా ముందుకు సాగాల్సిన అవసరం ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తోంది.

మే డే 2025 - ఇది కేవలం గతాన్ని స్మరించే రోజు మాత్రమే కాదు, న్యాయం, గౌరవం, సమానత్వంపై ఆధారితమైన భవిష్యత్తును నిర్మించేందుకు ఒక సంకల్పదినం.గత పోరాటాల స్ఫూర్తిని తీసుకొని, మానవీయతను కాపాడుతూ, శ్రమకు గౌరవం ఇచ్చే సమాజం వైపు మనమంతా కదలాలి. పని మారవచ్చు, పద్ధతులు మారవచ్చు - కానీ కార్మికుల హక్కులు, సంఘీభావం, సమానత్వం వంటి విలువలు నిలిచేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఇవే మన సమాజాన్ని గాఢంగా నడిపించే సత్యాలు.

**- డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**

# హక్కుల సంరక్షణే దేశానికి రక్షణ



మే ఒకటి 1886 నాడు అమెరికా చికాగో నగరం నడిబొడ్డున హేమార్కెట్ స్క్వేర్ ప్రాంతంలో రోజుకు 8-గంటల పని దినాలు మాత్రమే ఉండాలని కార్మికులు చేసిన నిరసనలు హింసాత్మకంగా మారడమే కాకుండా ఏడుగురు పోలీసులు, నలుగురు పౌరులు ప్రాణాలు సహితం కోల్పోవడం జరిగింది. ఈ నిరసన తర్వాత తాము కోరిన రోజుకు 8 గంటల పని విధానం అమలులోకి రావడంతో అలనాటి కార్మికుల నిరసనకు గుర్తుగా ప్రతి ఏట మే 1వ తేదీన అంతర్జాతీయ కార్మిక దినోత్సవం లేదా కార్మిక దినోత్సవం లేదా మే డే రూపంలో జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. దాదాపు 80 దేశాల్లో కార్మికుల దినోత్సవం రోజున సెలవు దినంగా ప్రకటించడం, ఆ రోజున శ్రామిక వర్గాలు ర్యాలీలు, సెమినార్లు, కవాతులు లాంటి పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. కార్మిక హక్కుల హననం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వారి ఆరోగ్య భద్రతే దేశ అభివృద్ధికి దోహదపడుతుందని తెలుసుకోవడం మన కనీస బాధ్యత అవుతుంది.

**కార్మికుల హక్కుల పరిరక్షణే దేశాభివృద్ధి**

శ్రామికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి దారపోస్తూ దేశాభివృద్ధికి గొడుగులు పడుతున్నారు. శ్రామికుల ప్రాధాన్యాన్ని వివరించడం, దేశ సమగ్రాభివృద్ధిలో వారి పాత్రను గుర్తించడం, ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు అభినందనలు తెలుపడం, కార్మిక ఉద్యమాలను గుర్తు చేసుకోవడం, కార్మికులకు తగు గౌరవం ఇవ్వడం, వారి కుటుంబాలకు అండగా నిలువడం, అన్ని వర్గాల శ్రామికులను ఒకే విధంగా చూసుకోవడం లాంటివి 01 మే రోజున చేయదగిన కనీస కార్యక్రమాలుగా ఉండాలి. 01 మే 1889 నుంచి కార్మిక దినోత్సవాలు పవిత్రంగా పాటించడం జరుగుతోంది.

**భారత్‌లో కార్మిక దినోత్సవం**

కామ్రేడ్ సింగవేలు చెట్టియార్ చొరవతో 1923 నుంచి భారత్లో మే డే వేడుకలు జరుగుతున్నాయి. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య సంరక్షణకు ఊతణ ఇవ్వగల వాతావరణం కల్పించడం యాజమాన్యాల కనీస బాధ్యత అంటూ కార్మిక చట్టాలు కూడా చేయడం జరిగినప్పటికీ అమలు ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా వారి గౌరవం, సమానత్వం, ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పని ప్రదేశంలో వివక్షరహిత వాతావరణ కల్పన, అందరి భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుంది. భారత శ్రామిక వర్గంలో దాదాపు 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండగా వారికి కనీస హక్కులు కల్పించడంలో విఫలం కావడం కొంత కలవరానికి దారి తీస్తున్నది. భారత రాజ్యాంగం ప్రకారం ఆర్టికిల్స్ 23 24, 39, 41 42 కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టబద్దత ఇవ్వడం జరిగింది. కార్మిక చట్టాల సంస్కరణతో 29 చట్టాలు చేయగా అందులో నాలుగు రకాల కోడ్లు కార్మికుల వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని ప్రదేశ పరిస్థితులుగా విభజించారు. ఈ నాలుగు కోడ్ల ద్వారా వేతనాల సవరణలు, పని గంటల నిర్ణయాలు, పారిశ్రామిక విధానాలు, పిఎఫ్/ ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.



అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేదిక ఒక చారిత్రక వేడుక మాత్రమే కాకుండా అది ఒక సమకాలీన సందర్భంగా కూడా గుర్తించడం జరుగుతోంది. నేడు డిజిటల్ వేదికలు అందుబాటులోకి రావడంతో ఆర్థిక గమనం వేగం పుంజుకోవడం, కార్మికుల హక్కులను కాపాడుకుంటూ సాంకేతికతకు అనుగుణంగా శ్రమజీవి కూడా తన మార్గాన్ని సవరింతుకుంటూ ముందడు వేస్తేనే దేశం బహుముఖంగా ఎదుగుతుందని నమ్మాలి.

**(మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం )**
**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# అందాల పోటీలను రద్దు చేయాలి



మే 10 నుండి మే 31 వరకు హైదరాబాద్లో 72వ మిస్ వరల్ అందాల పోటీలను నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వం , తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ మహిళలు, ప్రజలు ఖండిస్తున్నారు. దేశవ్యాప్తంగా మహిళా సంస్థలు ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.140 కి పైగా దేశాల నుండి పాల్గొనే మిస్ వరల్ అందాల పోటీని ప్రభుత్వం మరియు మీడియా 'రాష్ట్ర గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు,అరుదైన వంటకాలను దేశీయ విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి' అని ప్రచారం చేస్తున్నాయి.తెలంగాణ గొప్ప చేనేత వారసత్వం, అందమైన పర్యాటక ప్రదేశాలు , ప్రత్యేకమైన వంటకాలను ప్రదర్శించడానికి దేశీయ,విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి అందాల పోటీని ఒక వేదికగా ఉపయోగించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రానికి సంబంధించిన ఈ అంశాలను అంతర్జాతీయ ప్రదర్శనలు, సాంస్కృతిక సమావేశాలు లేదా ఇతర గౌరవప్రదమైన సమావేశాల ద్వారా ప్రచారం చేయవచ్చు. మహిళలను ఊరేగించి తీర్పు చెప్పే అభ్యంతరకరమైన కార్యక్రమానికి హైదరాబాద్ను వేదికగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. ఈ ప్రదర్శనలు మహిళల గౌరవానికి అవమానం. ఇప్పటికే మహిళల శరీరాలను వస్తు రూపంలో చూసే సభ్య సమాజంలో అందం ప్రామాణిక త కాదు. సాధికారత అనేది రూపం, బహిర్గతంలోనే ఉందనే ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు,భారతీయ మహిళలు వీధుల్లో,పని ప్రదేశాలలో లైంగిక హింసను ఎదుర్కొంటున్నారు.వారి దుస్తులు,వారి రూపం,వారు బయటకు వెళ్ళిన సమయంలో నిందలకు గురవుతున్నారు.కావున మహిళల గౌరవించాలన్న, తెలంగాణ సంస్కృతి ప్రపంచానికి చాటి చెప్పాలన్న, సాంస్కృతిక సమావేశాలు,ప్రదర్శనలు నిర్వహించవచ్చు. అందాల పోటీలు మాత్రమే ఏకైక మార్గం కాదు.



**- ఆళవందార్ వేణు మాధవ్**
8686051752

# కుంకుమ గీతం



మృత్యువు రైఫిల్ గా దూసుకొచ్చి
ప్రాణాల్ని జుర్రేసీ వెళ్ళాక
ఏముంటుందక్కడ
కొన్ని చివరిచూపులు తీరనికోర్కెలు
కొన్ని చివరి మాటలు
కొన్ని దినాలశారీరక పరిచయాలుతప్ప.

మాట్లాడకుండా పడివున్న
మనిషి దగ్గర అతనికోసం
అతని దారినే ఎంచుకున్న
వేటగాడి దెబ్బకు నేలకూలినపక్షిలా
ఆమె తోడుకోసం ఏడ్చి ఏడ్చి
మంచులా గడ్డకట్టి ఉంటుంది

మనిషికోసం తుపాకీని ముద్దాడిన
కూలి కుటుంబం కుప్పకూలుతుంది
అబ్బా కిదర్ గయే అనే పిల్లల ప్రశ్నలకు
తల్లి కన్నీళ్లు చూపుతుంది

శవమై వచ్చిన కొత్తపెళ్లికొడుకునుచూసి తల్లి
ఏమనుకుంటుంది
సంబరంగా చూస్తున్న కడలి కెరటం
తన బతుకునే మింగేసిందని
ధారలు దారలుగా ఏడుస్తుంది
అతడు లేడని ఇక రాడని
చిలక్కొయకున్నఅంగి జత కోసం
ఎదురుచూసి ఎద
కాల్చుకుంటుంది
పెంచుకున్న పప్పి అతనిఫోటోచూసి
మరీ మరీ అడుగుతున్నట్టు
అతని చుట్టూ తిరుగుతుంది

ఒక దుర్మార్గపు ఆలోచన
తుపాకీలోకి చొరబడితే
ఏమవుతుంది
కొన్ని దినసరి జీవితాలను
చీకటి నాకేస్తుంది
కొన్ని పచ్చడి మెతుకుల పల్లెములు
ఖాళీ కడుపులతో పస్తులుంటాయి
అనుమానపు రాళ్ళవాన
కొన్నిబతుకులనిలీళ్ళపాలుచేస్తుంది
కొన్ని యుద్ధ మేఘాలు
ఫుట్ పాత్ బతుకులని
రక్తపు కాల్వలు కాటేస్తాయి

ఒక మతోన్మాదాపు ఆలోచన
కోపం కొలిమిలో వేడెక్కుతే
ఏమౌతుంది
దేశందేశమే లయతప్పిన పాటవుతుంది
కండ్లు పీకేసి కాళ్ళుచేతులు విరిచేసిన
బొమ్మవుతుంది

కొన్ని అవకాశవాద రాజకీయాలు
గుండ్లు మింగేసిన గుండెల్ని
డప్పులుగా మలుచుకుంటాయి
దేశభక్తి రంగులద్దుకొని
ద్వేష బుద్ధితో ఊగిపోతాయి
అప్పుడు దేశా పూలతోట
విద్వేషాగ్నిలో కొంచెం కొంచెం
కుములు కుంటూనే ఉంటుంది.

**- డా. ఉదారి నారాయణ**

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రూపొందించిన చట్టం భూభారతి

- **నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



**వరంగల్,ఏప్రిల్ 30 (మనం ప్రతినిధి):** రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం భూభారతియని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అన్నారు.వరంగల్ జిల్లా నెక్కొండ, నర్సంపేట, నల్లబెల్లి మండల కేంద్రాల్లోని రైతు వేదికలలో బుధవారం రైతులు, ప్రజలకు నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సు లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూభారతి- నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి... మాట్లాడుతూ భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు.అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలనే సదుద్దేశంతో భూభారతి పోర్టల్ను తీసుకొచ్చామని తెలిపారు. రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకునే భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.రైతులు, ప్రజలు భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సమస్యలు ఒక్క పైసా ఖర్చు లేకుండా నిజమైన రైతులకు, ప్రజలకు భూహక్కులు లభిస్తాయన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు.ఈ చట్టం ద్వారా ఏదైనా న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు కమిషన్ ఏర్పాటు చేస్తారని, తద్వారా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని అన్నారు.

భూ భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా రైతులు తమ భూముల సమస్యలు సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. భూ భారతి చట్టంపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అంబేద్కర్ జయంతి రోజున భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం- 2025 ను ప్రారంభించిందని, ఈ చట్టంలోని అంశాల ద్వారా రైతు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఈ చట్టంపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా భూభారతిలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమని తెలిపారు.ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు. తహసిల్దార్ జారీ చేసిన ఉత్తర్వులపై రైతుకు న్యాయం జరగకపోతే రాజస్వ మండల అధికారి / సబ్ కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, అక్కడ న్యాయం జరగకపోతే కలెక్టర్ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. భూమి కొనుగోలు, పాలు పంపకం, వారసత్వ భూమి మార్పిడిలో సర్వేయర్ రూపొందించిన కమతం నక్షను జతపరచడం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. వారసత్వ భూముల విరాసత్ సమయంలో సంబంధిత కుటుంబ సభ్యులందరికీ నోటీసులు జారీ వ్యవస్థ ఉందని, గత ధరణి చట్టంలో ఈ అవకాశాలు లేకపోవడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయని అన్నారు.ప్రతి కమతానికి భూధార్ కార్డును కేటాయించి దీనిలో హద్దులతో కూడిన మ్యాప్ పొందుపరచనున్నట్లు చెప్పారు.

ఈ పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, ప్రత్యేక మాడ్యూల్స్, సెక్షన్స్ గురించి కలెక్టర్ కూలంకషంగా వివరించారు.త్వరలో జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, పరిశీలించిన పిదప జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతన చట్టం, తమ భూ సమస్యల గురించి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సులలో రైతులు, ప్రజల భూ సమస్యలకు సంబంధించిన సందేహాలను రెవిన్యూ అధికారులు నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గోవింద రాజన్,వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ లు ఎంపిడివో లు , పిఏసీఎస్ చైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## బసవేశ్వరుని బోధనలు స్ఫూర్తిదాయకం



**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, ఏప్రిల్ 29 (మనం ప్రతినిధి):** బసవేశ్వరుని బోధనలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.మహాత్మా బసవేశ్వర 892 జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టరేట్ లో బసవేశ్వర చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు సమసమాజ స్థాపన కోసం పోరాటం చేశారని, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన చేసిన కృషిసమాజం మరువలేనిదని తెలిపారు. లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్ప లత, డిఆర్డీఓ కౌసల్యాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమే



**మంచిర్యాల, ఏప్రిల్ 30 (మనం న్యూస్):** తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమే అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఇన్స్పెక్టర్ డి. కమలాకర్, ఏఆర్ఎస్ఐ ఎం. నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్ సుందర్ రావు లను పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమే నని, ప్రస్తుతం ఉద్యోగవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతో పాటు, కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించి రేపటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని అన్నారు ఉద్యోగవిరమణ చేసిన పోలీసు అధికారులు తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగ లేదా వ్యాయామాన్ని కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవితం గడపాలని పోలీస్ కమిషనర్ అన్నారు . ఈ కార్యక్రమములో మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపిఎస్., పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏఓ శ్రీనివాస్, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగం తో పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు వారి బంధుమిత్రులు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గతంలో కంటే రోడ్డు ప్రమాదాల శాతాన్ని తగ్గించాలి

- **ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి**
- **పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, ఏప్రిల్30 ( మనం న్యూస్):** గతంలో కంటే రోడ్డు ప్రమాదాల శాతాన్ని తగ్గించాలని, ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు . నెలవారి సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జీట్కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందనే మొద లైన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించారు. సిపి మాట్లాడుతూ, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించి ప్రజల ప్రాణాలు కాపాడుటకు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కల్సి పని చేయా లని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సి న చర్యలు చేపట్టాలని,

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్, టౌన్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రాత్రి సమయాల్లో ప్రజలు మనపై వున్న నమ్మకానికి తగ్గట్లుగా దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలిసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేసి చోరీలను నియంత్రించాలని, ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుంచి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు చట్టలకు లోబడి బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని, అదే విధంగా నమోదైన కేసులలో పారదర్శకంగా విచారణ జరిపి నిందితులకు శిక్షపడేలా చూసి బాధితులకు పోలీస్ పై నమ్మకం, భరోసా కలిగించే విధంగా విధులను నిర్వ హించాలన్నారు. నూతన చట్టాల ప్రకారం, సిసి టి ఎన్ ఎస్ 2.ఓ లో భాగంగా నేరాల విచారణ దర్యాప్తు, నిరూపణ లో ప్రజలకు బాధితులకు పోలీసులపై నమ్మకం భరోసా కలిగించే విధంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలో భాగంగా గౌరవ కోర్ట్ నుండి ఇ- సమాన్స్ సిసి టి ఎన్ ఎస్ అప్లికేషన్ ద్వారా ఆన్లైన్లో నేరుగా పోలీస్ స్టేషన్ కి పంపించడం జరుగుతుందన్నారు . పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవని, గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రవాణా చేసే వారిని గుర్తించి కేసులను నమోదు చేయాలని , గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలనీ ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపిఎస్., పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘువేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ఏ సి పి, పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, ఏసిపి మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.సి ఫలితాలలో కాకతీయ విద్యార్థుల విజయ దుందుభి



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 ( మనం న్యూస్):** బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో నగరం లోనికట్టరాంపూర్ లో గల కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు మరొకసారి అత్యుత్తమ మార్కులతో విజయ దుందుభి మోగించారు. పాఠశాల నుండి మొత్తంగా 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 100% ఉత్తీర్ణతతో 11 మంది విద్యార్థులకు 500 మార్కులకు పైన రావడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ తెలిపారు. ఇందులో

సుశాంక్-556, పూర్ణ శ్రీ - 546, హారిక -529 , శ్రీజ -524 , హరిమిత్ కౌర్ - 522 సిద్ధార్థ- 521, అనీష్-517 , లక్ష్మీ మనోజ్ఞ-516 , శాన్విత్-510 , రోహిత్- 507 ,, సాయి రక్ష- 501 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ

మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్, ప్రిన్సిపల్ గున్నాల అర్చన , అధ్యాపక బృందం అభినందించారు. ఆ తర్వాత పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించుకుంటూ, నాటి జిపిఎ సిస్టంలో గాని నేటి మార్కుల సిస్టంలో గాని

మా విద్యార్థులకు ఎవరు సాటి లేరు అని నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలియజేస్తూ ఇట్టి ఘన విజయానికి సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేయండి



- **సిపిఐ శ్రేణులకు చాడ పిలుపు**

**చిగురు మామిడి, ఏప్రిల్ 30 (మనం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసం పుట్టి ప్రజల సమస్యల పరిష్కార కోసం 100 సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన సిపిఐ పార్టీని బలోపేతానికి కృషి చేయండి అని సిపిఐ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు బుధవారం చిగురుమామిడి మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకులు బండారు తిరుపతి అధ్యక్షతన సిపిఐ గ్రామ శాఖ మహాసభ జరిగింది ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కార్మిక కర్షక పేద బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి, దోపిడీ లేని వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం అలుపెరుగని వందేళ్ళ పోరాటం నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశ రాజకీయ వ్యవస్థలో ప్రజల కోసం పనిచేసే పార్టీగా గుర్తింపు తెచ్చుకొని దేశం కోసం దేశంలోని అణచబడిన అన్ని వర్గాల ప్రజల సంరక్షణ కోసం అలాగే రాజ్యాంగ రక్షణ మానవ హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని చాలా చెప్పారు దేశంలో రాష్ట్రంలో రాజకీయ పరంగా పెను మార్పులు జరిగిన ప్రజల సమస్యలు మాత్రం తీరటం లేదని ఆవేదన చెందారు పాలకులు మారిన ప్రజల స్థితిగతులు ఏమాత్రం మారలేదని అన్నారు పాలకులు ఎందరు మారినా ప్రజల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ సిపిఐ అని చెప్పారు ఇలాంటి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరికి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భోగిని అశోక్, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, మమ్మల్ని పెల్లి గ్రామ శాఖ కార్యదర్శి అంటే సంపత్, వెంకటయ్య, రాములు, నరేష్, చుక్కయ్య సిపిఐ గ్రామ శాఖ కార్యకర్తలు ఉన్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన సింగరేణి సీఎండీ



**మంచిర్యాల, ఏప్రిల్ 30(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించిన కె. రామకృష్ణా రావును సింగరేణి సీఎండీ ఎన్.బలరాం బుధవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కె.రామకృష్ణారావు ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉంటూ సింగరేణి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఒకరిగా సంస్థ అభివృద్ధికి ఎంతగానో సహకరించారని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించవలసిందిగా సింగరేణి సీఎండీ ఎన్.బలరాం విజ్ఞప్తి చేశారు.

## రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం దోచుకుంటున్నది

- **మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు**



**మంచిర్యాల, ఏప్రిల్ 30 ( మనం న్యూస్):** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటున్నదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి కటింగు లేకుండా, ఎలాంటి షరతులు లేకుండా రైతులు దగ్గర నుంచి మరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గం లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులతో కలిసి బుధవారం అయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కట్టింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, కొనుగోలు కేంద్రంలో మాత్రం ప్రతి 40 కేజీల బస్తకు రెండు కేజీలు అదనంగా కాంటా వేసున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తరుగు పేరిట మంచిర్యాల నియోజక వర్గంలో అక్రమాలు చేస్తున్నారని, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన ఆరోపణలు, సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపిస్తామని చెప్పి ఇప్పటికే చాలా నెలలు అవుతుందని , వెంటనే గత 10 సంవత్సరాలలో జరిగిన వరి ధాన్యం కొనుగోలు పైన, ఇప్పుడు జరుగుతున్న వరి కొనుగోలు పైన వెంటనే సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య , గుల్లకోట మాజీ సర్పంచ్ గొల్ల రవీందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- **రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**



**మంచిర్యాల, ఏప్రిల్ 30(మనం ప్రతినిధి):** యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు, మిల్లులు, గోదాములకు తరలింపు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, అకాల వర్షాలు, ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ యాసంగి 2024- 25 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, ఇందు కొరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన మిల్లులకు వెంటనే తరలించాలని,అకాల వర్షాలు, వడగాలులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సి.ఎం.ఆర్ డిఫాల్టర్ రైస్ మిల్లులపై చర్యలకు ఉపక్రమించాలని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని,కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గోనె సంచులు అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, ఓ ఆర్ ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాలు, వడగాలుల పట్ల తగు చర్యలు తీసుకుంటున్నామని, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన మిల్లులకు ధాన్యం పంపించడం జరుగుతుందని తెలిపారు. గత సీజన్ సి ఎం ఆర్ బియ్యం అందించని మిల్లులపై సమీక్షిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు

- సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్

**కామారెడ్డి, ఏప్రిల్ 30 ( మనం జిల్లా ప్రతినిధి) :** రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సిసిఎల్ఏ కమీషనర్, భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులపై పైలెట్ మండలాలలో ఉన్న 4 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లింగంపేట్ తహసీల్దార్ కార్యాలయం నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ., భూ భారతి చట్టం అమలులో భాగంగా ముందస్తుగా 4 పైలెట్ మండలాలను ఎంపిక చేసుకొని, రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామని అన్నారు. పైలట్ మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సూచించారు. సాధా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి పూర్తి చేయాలని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., లింగంపేట్ మండలంలో ఉన్న 23 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, సుమారు 3700 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. సర్వే నెంబర్ సమస్యలు, విస్తీర్ణ సమస్యలు, సాదా బైనామ దరఖాస్తులు మొదలగు పలు రకాల భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలు, భూ భారతి చట్టం రూల్స్ ప్రకారం దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వి.విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ ప్రభాకర్, ప్రత్యేక అధికారి రాజేందర్, తహసీల్దార్ సురేష్, భూ కొలతల సహాయ సంచాలకులు ఏం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ సిబ్బందితో కలెక్టర్ సమావేశం

**లింగంపేట్, ఏప్రిల్ 30 ( మనం న్యూస్):** భూ భారతి చట్టం పై పైలెట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట్ మండలంలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం లింగంపేట్ ఎంపీడీఓ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17 నుండి 30 వరకు లింగంపేట్ మండలంలోని 23 రెవిన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపట్టవలసి ఉంటుందని తెలిపారు. సుమారు 3700 దరఖాస్తులు రావడం జరిగిందని, అట్టి దరఖాస్తులను పరిశీలించి చట్ట. ప్రకారం విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు 9 టీమ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అట్టి టీమ్ లలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్స్ లను నియమిస్తామని



తెలిపారు. ప్రతీ టీమ్ కు సుమారు 400 దరఖాస్తులు పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఆయా సిబ్బంది విధులు నిర్వహించుటకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. టీమ్ లకు కావసిన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ ప్రభాకర్, లింగంపేట్ తహసీల్దార్ సురేష్, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ జిల్లా శాఖ నూతన భవనానికి భూమి పూజ



**కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 30 (మనం న్యూస్):** టిఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ కార్యాలయ భవన భూమి పూజ మహోత్సవ కార్యక్రమం టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన వేద పండితులు ఆంజనేయ శర్మ వేదమంత్రోచ్ఛనులతో అక్షయ తృతీయ రోజున శుభ ముహూర్తమును పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ కార్యాలయ భూమి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ., టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ భవనం కొరకు భూమిని కేటాయించిన జిల్లా కలెక్టర్ యొక్క కృషి మరువలేనిదని, జిల్లా శాఖ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి వారి యొక్క తోడ్పాటు చాలా గొప్పదని అదేవిధంగా ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన కార్యవర్గ సభ్యులకు మరియు ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ చక్రధర్, కోశాధికారి ఎం దేవరాజ్, ఉపాధ్యక్షులు బి లక్ష్మణ్, రాజలక్ష్మి, బి రాజేశ్వర్ మరియు ఎంసీ పోచయ్య, జాయింట్ సెక్రటరీలు ఖదీర్, రాజమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కల్చరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ఈసి మెంబర్ సాయినాథ్, దత్త్రాద్రి మరియు అశ్వాక్, కామారెడ్డి అర్బన్ కోశాధికారి పవన్, ఉపాధ్యక్షులు ఎం కిషన్, కార్యవర్గ సభ్యులు అనుదీప్, సురేఖ, ఖీఅఖిఅ రాష్ట్ర కోశాధికారి శివకుమార్ మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్- అఖిలేశ్ యాదవ్ ఫొటో.. బీజేపీ విమర్శలు

**లఖ్‌నవ్, ఏప్రిల్ 30:** బీఆర్ అంబేద్కర్, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చిత్రాలను కలుపుతూ చేసిన ఫొటోపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌పై బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేద్కర్ ఫొటోతో కలుపుతూ..అఖిలేశ్ యాదవ్ ఫొటో ఉన్న చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీజేపీ ఆయనపై విరుచుకుపడింది. భారత రాజ్యాంగ నిర్మాత చిత్రాన్ని సగానికి చేయడం ఆయనను అవమానించడమే అవుతుందని బీజేపీ నేత అమిత్ మాలవీయ మండిపడ్డారు. అఖిలేశ్ యాదవ్ ఎన్ని జన్మలెత్తినా సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు సరితూగలేరని దుయ్యబట్టారు. సమాజ్‌వాదీ నేతలు చేసే ఇటువంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. దీనిపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ స్పందిస్తూ..అఖిలేశ్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎస్పీ నేతలు అంబేద్కర్‌ను, దళితులను అవమానించడానికి ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారని విమర్శించారు. అఖిలేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంక్షేమ పథకాలను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి సైతం అఖిలేశ్ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ నేతలు చేసే మురికి రాజకీయాలకు ఇవన్నీ నిదర్శనాలని, ప్రజలు వారిని ఎన్నటికీ క్షమించరని మాయావతి అన్నారు.

# అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించద్దు

- ఎంఈవో నాగేశ్వరరావు

**బాన్సువాడ, ఏప్రిల్ 30 ( మనం న్యూస్):** అనుమతులు లేని పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించ వద్దని బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడారు. బాన్సువాడ మండలంలో 20 ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. అనుమతి లేకుండా



పలు పాఠశాలలు అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు సమాచారం ఉందన్నారు. నూతనంగా ప్రారంభించే పాఠశాలలు, పాఠశాల బోర్డులు ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాన్సువాడ పట్టణంలో శ్రీ చైతన్య, అర్బర్ హైట్స్, మదీన స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిసింది అన్నారు. ఆ పాఠశాలలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. ఈ పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తల్లిదండ్రులు గమనించాలని కోరారు. అనుమతి లేని పాఠశాలలో విద్యార్థులని చేర్పించి వారి భవిష్యత్తుని నాశనం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల అనుమతి కోసం ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 వరకే గడువు ఉండేదని, గడువు ముగిసి కూడా చాలా రోజులైంది అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి ప్రభుత్వ అనుమతి ఉన్న పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా తమను సంప్రదించాలని కోరారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ఆప్ నేతలపై ఏసీబీ కేసు

- రూ.2వేల కోట్ల స్కామ్

**ఢిల్లీ, ఏప్రిల్ 30:** పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగానే ఆప్ మాజీ మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై ఏసీబీ కేసు నమోదు చేసింది.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోడియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కాయి. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి



గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా అయ్యింది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిపోయింది.

ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోడియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో తాజాగా వీరిపై కేసు నమోదైంది.

# భారత సైన్యంపై పాక్ తప్పుడు ప్రచారం.. అసలు విషయం చెప్పిన కేంద్రం

**ఢిల్లీ, ఏప్రిల్ 30:** పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్ చేస్తోన్న తప్పుడు సమాచారం 'ఫేక్ న్యూస్' అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్




విభాగం తేల్చిచెప్పింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత నెట్టింట్లో విరివిగా తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాకిస్థాన్ ఈ చర్యకు పూనుకుంటోంది. చివరకు మన సైన్యం గురించి అసత్య వార్తలు ప్రచారం అవుతున్నాయి. అసలు విషయం చెప్పి, భారత్ వీటికి కౌంటర్ ఇచ్చింది. ఉగ్రదాడి తర్వాత నార్తర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించారని, కస్టడీలోకి తీసుకున్నారని పాక్ అనుకూల సోషల్ మీడియాలో పలు పోస్టులు దర్శనమిచ్చాయి. భద్రతా వైఫల్యం కారణంగా ఆ చర్యలు తీసుకున్నారని వాటి సారాంశం. అవన్నీ నకిలీ వార్తలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తేల్చిచెప్పింది. సుచీంద్ర కుమార్ గురించి పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు తప్పుగా పేర్కొంటున్నాయని వెల్లడించింది. వాస్తవంగా ఏప్రిల్ 30న కుమార్ పదవీ విరమణ చేస్తున్నారు. ఆయన స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మ బాధ్యతలు చేపట్టనున్నారని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. అలాగే నియంత్రణ రేఖ సమీపంలో భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాన్ని పాక్ సైన్యం కూల్చివేసిందని ఓ వార్త చక్కర్లు కొట్టింది. అది తప్పుడు కథనం అని భారత్ తేల్చిచెప్పింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన అనేక యూట్యూబ్ ఛానెళ్లను భారత్ నిషేధించిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రభుత్వం ఓవైపు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచేలా పలు వీడియోలు సోషల్ మీడియాలో పుట్టుకొస్తున్నాయి. ఇటువంటి వాటిని పరిశీలించిన పీటీఐ వార్తా సంస్థ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. అందులో చాలా వీడియోలు నకిలీవని తేల్చింది.

# రష్యా విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ దూరం



మాస్కో, ఏప్రిల్ 30: ప్రధానమంత్రి మోదీ రష్యా పర్యటన రద్దయ్యింది. మే 9న రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రకటించింది. భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదని తెలుస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డే పేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# కెనడా ప్రధాని 'కార్నీ'వాల్..

**ఒట్టావో, ఏప్రిల్ 30:** ప్రధాని మార్క్ కార్నీ నేతృత్వంలోని లిబరల్ పార్టీ కెనడా ఎన్నికల్లో ఆధిక్యం సాధించింది. ఈక్రమంలో పార్టీ నేతలంతా సంబరాల్లో మునిగిపోయారు. ఈక్రమంలోనే ఓ కార్యక్రమంలో కార్నీ డ్యాన్స్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. దీంతో ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీనే ఆ పదవిలో కొనసాగనున్నారు. మొత్తం 343 సీట్లున్న పార్లమెంటులో కార్నీ నేతృత్వంలోని ఆ పార్టీకి 168 సీట్లు దక్కాయి. ఈ క్రమంలోనే కార్నీతో పాటు పార్టీ నేతలంతా సంబరాలు చేసుకున్నారు. రాప్-రాక్ బ్యాండ్ డౌన్ విత్ వెబ్‌స్టర్‌లో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో డిడబ్ల్యూడబ్ల్యూ హూడీ ధరించిన కార్నీ 'టైమ్ టు విన్' పాటకు అక్కడి వారితో కలిసిస్టెప్పులేశారు.



**ప్రతిపక్ష నేతలకు ఘోర పరాభవం**

అట్టావాలో పోటీ చేసిన ప్రతిపక్ష నేత పియర్.. ఎన్నికల్లో ఘోర అవమానం పాలయ్యారు. కొద్ది నెలల కిందట ప్రధాని పదవికి గట్టి పోటీదారుగా ఉన్న ఆయన సోదిలో లేకుండా పోయారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌లాగే పియర్‌కు ఫైర్‌బ్రాండ్‌గా పేరుంది. కెనడా ఫస్ట్ అనే నినాదాన్ని పియర్ వినిపించారు. అయితే అదే నినాదం ఆయనను, ఆయన పార్టీని నిండా ముంచింది. ఖలిస్థానీ మద్దతుదారుగా ఉన్న న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్డీపీ)అధ్యక్షుడు 46 ఏళ్ల జగ్మీత్ సింగ్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. ట్రూడో ప్రధానిగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి జగ్మీత్ మద్దతిచ్చారు. దానిని ఉపయోగించుకుని ఖలిస్థాన్‌కు అండగా నిలిచారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించారు. 2021లో 25 సీట్లను గెలుచుకున్న జగ్మీత్ పార్టీ ఎన్డీపీ ఈసారి కేవలం 7 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**కార్నీకి ట్రంప్ అభినందనలు...**

ఇదిలాఉండగా.. ప్రధాని కార్నీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. వైట్‌హౌస్ ఈ విషయాన్ని వెల్లడించింది. 'ఎన్నికల్లో విజయం సాధించిన ప్రధాని కార్నీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. త్వరలోనే వీరువురు నేతలు వ్యక్తిగతంగా భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. ఇరుదేశాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వీరు చర్చిస్తారు' అని ఓ ప్రకటనలో తెలిపింది.

# ఆ నీళ్లు పాక్‌కు వెళ్తాయి.. మాకివ్వండి

- పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా

ఛండీగఢ్, ఏప్రిల్ 30: పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం.



''జూన్ నాటికి భాక్రానంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో ఢిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం'' అని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# యుద్ధం.. తొందరగా ముగిసే వ్యవహారం కాదు: రష్యా



మాస్కో, ఏప్రిల్ 30: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు ఒప్పందం అనేది అంత తొందరగా కొలిక్కి వచ్చే వ్యవహారం కాదని రష్యా తెలిపింది.ఉక్రెయిన్ శాంతి ఒప్పందం విషయంలో రష్యా కీలక వ్యాఖ్యలు చేసింది. యుద్ధం ముగింపును త్వరితగతిన కొలిక్కి తీసుకురాలేని ఓ సంక్లిష్ట వ్యవహారంగా పేర్కొంది. దీనికి ముందు పరిష్కరించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయని తెలిపింది. ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి తెరదించేందుకు అమెరికా ఒత్తిడి తీసుకొస్తున్న వేళ ఈమేరకు స్పందించింది.

''శాంతి చర్చలకు ముందు కాల్పుల విరమణకు రష్యా అధ్యక్షుడు పుతిన్ సిద్ధంగా ఉన్నారు. అయితే, ఒప్పందం కుదుర్చుకునే ముందు కొన్ని ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. కొన్ని విభేదాలను పరిష్కరించుకోవడం అవసరం'' అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పెస్కొవ్ తెలిపారు. శాంతి ఒప్పందం కోసం ముందస్తు షరతులు లేకుండా ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనేందుకు పుతిన్ కూడా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.''యుద్ధం ముగింపు విషయంలో వేగవంతమైన పురోగతి ఉండాలని అమెరికా కోరుకుంటోంది. కానీ.. ఇది చాలా క్లిష్టమైన వ్యవహారం. అంత త్వరగా ముగిసే అంశం కాదు. ఈ ఒప్పందానికి ముందు అనేక అంశాలను పరిష్కరించాల్సి ఉంది. దీన్ని వాషింగ్టన్ అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నాం'' అని పెస్కొవ్ తెలిపారు. మరోవైపు.. 108 డ్రోన్లతో రష్యా తాజాగా దాడులు చేసిందని, ఖర్కీవ్‌లో 45 మంది పౌరులు గాయపడ్డారని ఉక్రెయిన్ తెలిపింది.

# గృహ నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

- పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ



**పత్తికొండ, ఏప్రిల్ 30(మనం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వై.ఎస్. షర్మిలారెడ్డిని గన్నవరం,విజయవాడలోని ఆమె నివాసంలో గృహనిర్బంధం చేయడం సరైనది కాదని, ప్రజాస్వామ్యాన్ని అవమానించే ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ తరపు ఖండిస్తున్నానాని పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక మహిళా నేతను నేరస్తురాలిలా ముట్టడి చేసి గృహ నిర్బంధంలో పెట్టడం స్వేచ్ఛా హక్కులకు విఘాతం కలిగించే చర్య.ఇది నేడు ఒక మహిళా నేతపై అయితే, రేపు రాష్ట్రంలో ప్రజల గొంతు వినిపించే ప్రతి ఒక్కరిపై జరగే ప్రమాదాన్ని సూచిస్తోంది. పోయిన వైసీపీ ప్రభుత్వంలో ఇలానే నిర్బంధాలు చేశారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇలానే ఉంది. 2015లో ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మళ్లీ 2025 మే 2న భూమిపూజ చేయడమంటే,గత పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఎలాంటి స్పష్టత లేకుండా కేంద్ర ప్రభుత్వాల మోసపూరిత ధోరణిని తేటతెల్లం చేస్తుందన్నారు. మూడు రాజధానుల నాటకంతో ప్రజల్లో అయోమయం రేపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తోడు,ఇప్పుడు ఎన్డీఏ కూటమి కూడా రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను దుర్వినియోగం చేస్తోంది. భాజపా, తెలుగుదేశం, జనసేన పార్టీలు స్వలాభం కోసం స్వేచ్ఛా భావాలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తుండగా,పవన్ కళ్యాణ్ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలు మరియు అనుచితమైనవిగా ఖండిస్తున్నాను.దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీని కించపరిచే వ్యాఖ్యలు వాస్తవాలను విస్మరించే రాజకీయ చర్యలే అని నిర్దేశిస్తున్నాను. ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలమైన ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. శాంతి, అభివృద్ధి, లౌకికత - ఇవే కాంగ్రెస్ పాలనకు లక్షణాలు. నేడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఈ ప్రభుత్వం ముందు ప్రతి బాధ్యత గల పౌరుడు నిలదీయాలి. పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలారెడ్డికి పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలంతా అండగా ఉంటామన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాడతామని అయన తెలిపారు.

## అపురూపం.. రాఘవేంద్రుడి చిత్రం

**మంత్రాలయం, ఏప్రిల్ 30,(మనం న్యూస్ :** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ముందు మద్వా కారిడార్ లో 41,346 చదరపు అడుగుల శ్రీ రాఘవేంద్ర స్వామి ప్రతి రూపాన్ని, పంచముఖి ఆంజనేయ స్వామి రూపాన్ని అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఎంతో అధ్భుతంగా తీర్చి దిద్దారు. మైసూరు కు చెందిన ప్రపంచ రికార్డు కళాకారుడు పునీత్ కుమార్, రంగోలి కళాకారిణి లక్ష్మి శ్రీ మఠం ముందు మద్వా కారిడార్ లో 41,346 చదరపు అడుగుల విస్తీర్ణంలో శ్రీ రాఘవేంద్ర స్వామి చిత్రపటాన్ని రంగోలితో రూపొందించారు. ఈ చిత్రాన్ని రూపొందించేందుకు 9 మంది బృంద సభ్యులు పునీత్ కళాకారిణి లక్ష్మి, ఆదిత్య, సంప్రీత్, సంజయ్, రవిచంద్రన్, రాఘవ్ ఆర్ అడలికట్టి, మంజునాథ్ చిత్రాన్ని రూపొందించగా వారికి సహాయకులు గా కుమార్ స్వామి, అరవింద్, గిరీష్, మధు, రాజు ఉన్నారు. వారికి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు శేషవస్త్రం ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



## కంచి పీఠాది పతికి మహానందీశ్వరుని ప్రసాదం



**మహానంది, ఏప్రిల్30,మనంన్యూస్ః** జగద్గురువు కంచి కామకోటి 71 వ పీఠాధిపతి గా శిష్య స్వీకారం చేసిన సత్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామిజీకి బుధవారం మహానందీశ్వర స్వామివారి ప్రసాదాలతో పాటు, స్వామివార్ల చిత్ర పటాన్ని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ,వేదపండితులు రవిశంకర్ అవదానిలు అందజేశారు.కంచి పీఠాధిపతి గా కొనసాగిన శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశిషులతో బాధ్యతలు చేపట్టిన సత్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి ని కలిశారు.వారివెంట ఏ ఈఓ మధు ఉన్నారు.

## ఘనంగా పెద్దమ్మ జాతర

**మహానంది, ఏప్రిల్30,మనంన్యూస్ః** నంద్యాల జిల్లా, మహానంది మండల పరిధిలోని అబ్బీపురం గ్రామంలో పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. పది సంవత్సరాల తరువాత నిర్వహించిన ఈజాతరకు గ్రామస్తుల బంధువులు, సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారు జామున పెద్దమ్మ తల్లికి పొలిమేర రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం జంతు బలి కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మహానంది ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## వివాహ వేడుకల్లో సుధీర్ రెడ్డి



**కౌతాళం, ఏప్రిల్ 30 (మనం న్యూస్) :** అగసలదిన్నె గ్రామంలో మరియు మురళి గ్రామంలో కౌతాళం కృష్ణ అవధూత ఆశ్రమంలో పలు వివాహాలకు మరియు టైలర్ బసవ గౌడ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్య క్రమంలో బాపురం వెంకటరెడ్డి,సర్పంచ్ రమేష్ గౌడ్, నాగరాజుగౌడ్, రెహమాన్,సిద్దు,రాజబాబు, గణేష్, అక్బర్ సాబ్,ఉగ్గి నాగ, భీమయ్యపాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం బోర్డు సరే.. సమాచారం ఏదీ?

**తుగ్గలి,ఏప్రిల్ 30(మనం న్యూస్ ):** సామాన్యునికి వజ్రాయుధం లాంటి చట్టమైన సమాచార హక్కు చట్టానికి మండల అధికార యంత్రాంగం తూట్లు పొడుస్తోంది. ఇంత ప్రాధాన్యం కలిగిన సమాచార హక్కు చట్టం-2005ఈ బోర్డులలో సమాచార అధికారి పేరు ఫోన్ నెంబర్,సహాయ సమాచార అధికారి పేరు ఫోన్ నెంబర్, సమాచార అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నెంబర్ ముద్రించి ఉండాలని చట్టం చెప్తుంది కానీ తుగ్గలి మండలం,ఉప్పర్లపల్లి గ్రామంలో ఉన్న సచివాలయ కార్యాలయం ముందు భాగంలోని గోడపై ఈ విధంగా కేవలం అరకొర సమాచారంతో దర్శనమిస్తోంది.ఈ నిబంధనను అధికారులు ఉల్లంఘిస్తున్నారు,అధికారులు మారినా బోర్డులో పేర్లు,ఫోన్ నెంబర్ లు మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వివరాలు సరిగా




లేనందున ఎవరికీ సమాచారం ఇవ్వాలో ప్రజలు తికమక పడుతున్నారు.అధికారులు స్పందించి ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను బోర్డులపై రాయించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై సమాచార హక్కు బోర్డు విషయమై ఈవోఆర్డీ వివరణ కోరగా ఈవోఆర్డీ శ్రీహరి స్పందించి బోర్డులో పూర్తి సమాచారాన్ని త్వరగా పూర్తి చేస్తామన్నారు.

# ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతు సంఘం నాయకులు డిమాండ్



**బేతంచేర్ల మనంన్యూస్:** మండలపరిదిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామ రైతులను రైతు సంఘం మండల కార్యదర్శి పి రామమోహన్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమానికి ఎపి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడులు మండల గౌరవ అధ్యక్షులు ఎన్. కిష్టన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భం గా రైతు సంఘం నాయకులు రాజశేఖర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఎయే పంటలను సాగుచేశారని రైతులను అడిగారు రైతులు సంఘం నాయకులతో మాట్లాడుతూ మాఏ గ్రామము మరియు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు సుమారుగా 5 వందల ఎకరాలలో కొర్ర పంట సాగు చేశామని తెలిపారు అలాగే కొర్ర పంట కోతలు మొదలయ్యాయని రైతులు తెలిపారు అయితే గత సంవత్సరం క్వింటాలు కొర్రలు 7వేల రూపాయలు ప్రకారం అమ్మామని తెలిపారు అయితే ప్రస్తుతం క్వింటం 2వేల 5 వంద లనుండి2వేల 7వందలు రూపాయలు వరకు మాత్తమే ధర ఉన్నదని వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు చెప్పు తున్నారు గతానికి ఇప్పటికీ సాగు ఖర్చులు పెరిగాయని అన్నారు ధర లేక పోవడంతో సాగుకు పెట్టిన పెట్టు బడి కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు సంఘం నాయకులు రైతులతో మాట్లాడుతూ రైతులు సంఘటితమై గిట్టుబాటు ధర కల్పించుటకొరకై ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి ప్రభుత్వంపై వత్తిడి పెంచి గిట్టు బాటు ధరను కల్పించాలని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు గ్రామాల్లో ఏర్పాటు చేసి రైతులను ఆదుకొనుటకుమనమందరమూ కలిసి పోరాటం చేసి సాధంచుకుందామని మీ వెంట మేముంటామమని రైతులకు హామీ ఇచ్చారు

### రైతు సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు

రైతు సంఘం రంగాపురం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడడం జరిగింది గ్రామ కమిటి అధ్యక్షులుగా నీలి రాంబాబు కార్యదర్శిగా పసుపుల మధుసూదన్ ఉపాధ్యక్షులుగా యామసాని ఈశ్వర్ రెడ్డి పి.నారాయణరెడ్డి కార్యదర్శులుగా జలాల్ మహమ్మద్ రఫి టి మద్దిలేటిస్వామి గోరుకల్లు భాష కమిటీ సభ్యులుగా వడ్ల ఖాదర్ బాషా వై మనోహర్ బి వెంకటసుబ్బయ్య పి.రంగారెడ్డి వై మహమ్మద్ యు.శేఖర్ జీకే.మధు పి.నబి రసూల్ మద్దిలేటిస్వామి తదితరులను రైతుల సమక్షంలోఎన్నుకోవడం జరిగింది.

# వడదెబ్బతో .. జర జాగ్రత్త..

- వైద్యాధికారి డాక్టర్ హరిత

**తుగ్గలి, ఏప్రిల్ 30 (మనం న్యూస్ ):** వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మండల కేంద్రమైన తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరిత పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు బయటికి వెళ్లే సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఇలా సూచించారు. గర్భిణులు, బాలింతలు, 10సంవత్సరాల పిల్లలు,60సంవత్సరాలు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండాకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,నీరు మరియు ఓఆర్ఎస్ తీసుకోవాలని. .వీలైనంతవరకు పనులంటిని ఉదయం లేదా సాయంత్రం సమయాలలో పూర్తిచేసుకో వాలన్నారు. కళ్ళు తిరగడం, విరోచనాలు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సంప్రదించలన్నారు.

## ఆయుర్వేదం అభయహస్తం

**తుగ్గలి,ఏప్రిల్ 30( మనం న్యూస్ ):** తుగ్గలి మండల ప్రజలు ఆయుర్వేద వైద్య సేవాలను వినియోగించుకోవాలని తుగ్గలి ఆయుర్వేదం ప్రభుత్వ వైద్యాధికారి డా.జి.అమర్నాథ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లనొప్పులు, చర్మ వ్యాధులు,గ్యాస్ట్రిక్ సమస్యలు,పైల్స్ మరియు ఫిస్టులా సమస్యలు,పిల్లల్లో ఎనీ మియా, ప్రసవించిన స్త్రీలలో పాలు పడకపోవడం సమస్యలకు తుగ్గలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుర్వేదం డిస్పెన్సరీలో వైద్య సేవలు పొందాలని వైద్యాధికారి ప్రతిరోజు ఉదయం



9 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు అందుబాటులో ఉంటారని,త్వరలో ఆయుర్వేదం డిస్పెన్సరీలో అన్ని రకాల ఆయుర్వేదం మందులు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి డా.జి.అమర్నాథ్ తెలిపారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న దాట్ల సుబ్బరాజు



**కౌతాళం, ఏప్రిల్ 30 మనం న్యూస్ :** కౌతాళం మండల కేంద్రంలో వైయస్సార్సీపి సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు ఆదేశాల మేరకు పలు వివాహ కార్యక్రమాలలో పాల్గొన్న వైయస్సార్సీపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు ఈడిగ లక్ష్మన్న కుమారుడు బసవరాజును నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బోయ లింగన్న కుమార్తె శ్రావణి పెళ్లికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే చాకలి సుఖేందర్ నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. అలాగే పెళ్లి పెద్దలు వైఎస్ఆర్సిపి దాట్ల సుబ్బరాజును శాల్వతో పూలమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కుమార్ రాజు, సత్య గౌడ్, ఉపేంద్ర గౌడ్, ఆనంద్, జంబయ్య,డ్రైవర్ లింగన్న, దాట్ల యూత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహం ప్రతిష్ఠ

**కౌతాళం, ఏప్రిల్ 30 మనం న్యూస్:** కౌతాళం మండల పరిధిలోని బుధువారం రోజున వల్లూరు గ్రామంలో ఘనంగా రౌడుకుంద్ స్వాముల వారు శ్రీ హల్వి మంతేష్ స్వాములవారు నూతన శిలామండపాన్ని శిలా విగ్రహాన్ని ప్రారంభించడం జరిగింది. విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఈ విగ్రహ ప్రారంభోత్సవాన్ని ఒక పండగలా జరుపుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు అడివప్ప గోడు మాట్లాడుతూ శ్రీ జగజ్యోతి బసవేశ్వర విగ్రహం మన గ్రామంలో ప్రతిష్టించడం చాలా ఆనందంగా ఉందని అలాగే ఈ విగ్రహానికి సహకరించిన దాతలకు, గ్రామ ప్రజలకు,ప్రతి ఒక్కరికి వల్లూరు గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# భక్తుడికి సెల్ ఫోన్ అప్పగింత

**మహానంది, ఏప్రిల్30,మనంన్యూస్:** మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చి పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను దేవస్థానం ఉద్యోగులు అప్పగించారు. బుధవారం మహారాష్ట్ర, సోలాపూర్ కు చెందిన శ్రీశైల సిద్ధప్ప అనే భక్తుడు మహానందీశ్వరుని దర్శనార్థమై వచ్చాడు. ఆలయ ప్రాంగణంలో సెల్ ఫోన్ ను పోగొట్టుకున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న హోమ్ గార్డ్ శరత్ నాయక్ కు విషయం తెలిపాడు. వెతికి సెల్ ఫోన్ ను దేవస్థానం ఉద్యోగి నీలకంఠం రాజు చేతుల మీద భక్తునికి అందించారు.



## నామకరణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే హాజరు



**తుగ్గలి, ఏప్రిల్ 30 ( మనం న్యూస్)ః** మండల కేంద్రమైన తుగ్గలి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు స్వర్గీయ ప్రహ్లాద రెడ్డి ,మాజీ సింగల్ విండో అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతుల కుమార్తె లక్ష్మీ సౌందర్య, అల్లుడు సుదర్శన్ రెడ్డి ల కుమార్తె కు బుధవారం నామకరణం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యురాలు శ్రీ దేవమ్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు స్థానిక వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి లు స్వాగతం పలికి ఆహ్వానించారు.అలాగే ఈ కార్యక్రమానికి వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సింగల్ విండో అధ్యక్షులు రమణారెడ్డి, చెన్నకేశవ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, వైసీపీ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు హాజరై నామకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైభవంగా గంధ లేపన మహోత్సవం

**మంత్రాలయం, ఏప్రిల్ 30(మనం న్యూస్) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గంధ లేపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు ఆధ్వర్యంలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మూల బృందావనాన్నికి గంధ లేపనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అంతకు ముందు శ్రీ మంచాలమ్మకు, మఠంలో కొలువు తీరిన శ్రీ ఆంజనేయ స్వామి ప్రతిమకు, పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు గంధ లేపనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని



దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్షయ తృతీయ పురస్కరించుకుని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ రాజా ఎస్ గిరియాచార్యులు, శ్రీ సుబుధేంద్ర తీర్థలు ప్రారంభించారు.

# పొగాకు కొనుగోలు నిర్ణయంపై హర్షం

**కర్నూలు ఏప్రిల్ 30మనం న్యూస్:** రాష్ట్రంలో నల్ల బర్లి పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఆదేశాలు జారీ చేయడం పట్ల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం మాట్లాడుతూ గత 20 రోజులుగా నల్ల బార్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఒక క్వింటాల్ 18 వేల రూపాయలు చొప్పున తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాల నిర్వహించాము ఈ నేపథ్యంలో నిన్న విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు రైతు సంఘాల ప్రతినిధులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు మరియు పొగాకు కంపెనీల యాజమాన్యంతో చర్చించి తక్షణమే నల్ల బర్లి పొగాకును కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఈ ప్రకారము వెంటనే నల్ల బార్లీ పొగాకు సంబంధించిన కంపెనీలు ఐటిసి, జిపి, అలయన్స్, వివిస్ కంపెనీలు తక్షణమే కొనుగోలు ప్రారంభించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు ఒక ఎకరా 60 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి రైతులు పొగాకు అమ్మకం కోసం గోడౌన్ల దగ్గర తీసుకుపోతే వాపస్ పంపుతున్నారు నాణ్యత లేదనే పేరుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు దీని వల్ల రైతులకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు నల్ల బార్లీ పొగాకును పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకొని రావాలని రైతు సంఘం నాయకులు చర్చించగా అందుకు మంత్రి అంగీకరించారు అన్నారు. పొగాకు కొనుగోలు చేసే రైతులతో మొదట ఒప్పందం కుదుర్చుకొని పంట వచ్చిన తర్వాత పంటకు అనేక పేర్ల పెడుతూ రైతులను మోసం చేస్తున్నారని కావున ఇలాంటి కంపెనీల పై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు మంత్రిని కోరారు పొగాకు కంపెనీ మోసాల వల్ల గత 20 రోజులుగా గత్యంతరం లేక రైతులు తమ పొగాకును తక్కువ ధరకు అమ్ముకున్నారని ఇంకా చాలా మంది పొగాకు రైతుల దగ్గర నిల్వ ఉన్నది గోడౌన్ లో నిలువ వచ్చారు ఈ పొరకు ఇతర చోట్ల నమ్మకానికి తీసుకోవడానికి వీలుకాదు ఇది కంపెనీలు తప్ప ఇతరులు ఎవరు కూడా ఈ పొగాకు కొనరు సిగరెట్లకు పనికొచ్చే నాణ్యమైన పొగాకును తక్కువ ధర కొని రైతులను దోపిడీ చేయాలని కంపెనీ యాజమాన్యాలు చూస్తున్నాయి వీరి ఆటలు సాగునీయకుండా రైతు సంఘాలు ఉద్యమాల బాట పడతామని ఆయన హెచ్చరించారు ప్రభుత్వ ఆదేశాల మేరకు పొగాకును కంపెనీలు పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అలా కొనుగోలు చేయని కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రిగ హెచ్చరించారు కావున పొగాకు కంపెనీలు తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు అంతేగాక మంత్రి చెప్పిన ఆదేశాలు ఆచరణలో పెట్టాలి కేవలం ప్రకటన చేసి వదిలేస్తే సరిపోదు అని అన్నారు మంత్రిగారు చెప్పిన ఆదేశాల ప్రకారం వ్యవసాయ అధికారులు పొగాకు పండించే గ్రామాల్లో తిరిగి రైతులను గోడలు దగ్గరకు రప్పించి రైతులు పూర్తిస్థాయిలో పోగా కు అమ్మకాలు జరిగే విధంగా బాధ్యత వ్యవసాయ అధికారులు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి నగర కార్యవర్గ సభ్యులు అన్వర్ ప్రజానాట్యమండలి నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.




## నీటి సమస్య పరిష్కారం

**బేతంచేర్ల, ఏప్రిల్ 30 మనంన్యూస్ః** పట్టణం లో నగర 5 వార్డు నందు ( పిండి జిన్ను లైన్) లో గత ఐదు సంవత్సరాల నుండి నీటి ట్యాంకర్స్ నిరుప్రయోగంగా పడి ఉన్నాయి ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పంపించి ట్యాంకర్స్ ను శుభ్రం చేయించి రంగులు వేసి ట్యాంకర్స్ కు నీటిని వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ముస్లిం నాయకులు జాకిర్ల బేగ్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ సిద్ధిక్ షాకీర్ పాల్గొన్నారు.

## కేంద్ర క్యాబినెట్ నిర్ణయం పై ఎం.పి హర్షం

**కర్నూలు ఏప్రిల్ 30మనం న్యూస్:** జనాభా లెక్కలతో పాటు కులగణను చేపట్టేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పై కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు... సర్వేలకు బదులుగా పారదర్శకంగా కులగణ ను చేపట్టి, జనాభా లెక్కల్లో కులగణను చేరుస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు... దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీ.సీలకు కులగణన తో నే అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు.. కులగణ ను జరిగినప్పుడే బీ.సీ కులాల వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత అభివృద్ధి చెందుతారని ఎం.పి తెలిపారు.

# ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

- నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు

**కర్నూలు ఏప్రిల్ 30మనం న్యూస్ః** ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి అని నగరపాలక సంస్థ కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. బుధవారం నగరపాలకలో పారిశుద్ధ్య తనిఖీదారులుగా పనిచేస్తూ పదవి విరమణ పొందిన యూ.హరినాథ్, యూ.శ్రీనివాసులకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాల్లో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడి, ప్రోత్సాహించిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ ఇశ్రాయేల్, సూపరింటెండెంట్లు రామక్రిష్ణ, సూరరంగా బాబు, ఆర్ఐ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.










# చెన్నైకి మరో హ్యాట్రిక్ ఓటమి.. చెపాక్‌లో పంజాబ్ విజయం

ఐపీఎల్ 18లో చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో హ్యాట్రిక్ ఓటమి. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్లో పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత సామ్ కరన్ (88) చెలరేగడంతో సీఎస్కే 19.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్కు దిగిన పంజాబ్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో శ్రేయస్ అయ్యర్ (72: 41 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు), ప్రభ్సిమ్రన్ సింగ్ (54: 36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధశతకాలతో వీర విహారం చేశారు. చెన్నై బౌలర్లలో పతిరణ 2, ఖలీల్ అహ్మద్ 2, నూర్ అహ్మద్, జడేజా తలో వికెట్ పడగొట్టారు. 10 మ్యాచ్లు ఆడిని చెన్నైకి ఇది ఎనిమిదో ఓటమి కాగా, పంజాబ్కు ఇది ఆరో విజయం. ఈ గెలుపుతో పంజాబ్ (13 పాయింట్లు) పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. తొలుత సామ్ కరన్ (88; 47 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు) అదరగొట్టిన వేళ.. చెన్నై 19.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటయ్యింది. డెవాల్ బ్రెవిస్ (32; 26 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. షేక్ రషీద్ (11), ఆయుష్ మాత్రే (7), రవీంద్ర జడేజా (17) ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో చెన్నై 48 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో సామ్కరన్, బ్రెవిస్ సీఎస్కేను ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్కు 78 పరుగుల భాగస్వామ్యాన్ని (50 బంతుల్లో) నెలకొల్పింది. యాన్సెన్ బౌలింగ్లో సామ్ కరన్ ఐదో వికెట్గా వెనుదిరిగాడు. చాహల్ 19 ఓవర్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. రెండో బంతికి ధోనీ (11) ఔట్ చేశాడు. మూడో బంతికి రెండు పరుగులు రాగా.. తర్వాత దీపక్ హుడా (2), అన్షుల్ కాంబోజ్ (0), నూర్ అహ్మద్ (0) వరుస బంతుల్లో పెవిలియన్కు పంపించాడు.

# ఈసారైనా కప్ వచ్చేలా చూడు స్వామి..

ఐపీఎల్-2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జోరు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 10 మ్యాచ్లు ఆడిన ఆర్సీబీ.. 7 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆర్సీబీ తమ తదుపరి మ్యాచ్లో మే 3న చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్తో తలపడనుంది. ఈ మ్యాచ్ కు ఇంకా మూడు రోజుల సమయం ఉండడంతో ఆర్సీబీ కెప్టెన్ రజిత్ పాటిదార్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో పాటిదార్ తన సహచర ఆటగాడు జితేష్ శర్మ, టీమిండియా మహిళా క్రికెటర్ శ్రేయంకా పాటిల్తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఈ క్రికెటర్లను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా ఆర్సీబీ కెప్టెన్గా తొలిసారి బాధ్యతలు చేపట్టిన పాటిదార్ జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు.బ్యాటింగ్, కెప్టెన్సీతో ఆకట్టుకుంటున్నాడు పాటిదార్. అతడితో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సైతం అదరగొడుతున్నాడు. వరుస హాఫ్ సెంచరీలతో ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. బెంగళూరు మరో రెండు మ్యాచ్లో గెలిస్తే తమ ప్లే ఆఫ్ బెర్త్ను ఖరారు చేసుకుంటుంది.



# ట్రెండింగ్ న్యూస్..: రజనీకాంత్ 'జైలర్2'లో బాలకృష్ణ?

రజనీకాంత్, బాలకృష్ణ కలిసి తెరపై సందడి చేయబోతున్నారా? అంటే కోలీవుడ్ వర్గాలు అవుననే అంటున్నాయి. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జైలర్2'. ఇటీవల ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం నందమూరి బాలకృష్ణను చిత్ర బృందం సంప్రదించిందట. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తమిళ చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. రజనీ-నెల్సన్ కాంబినేషన్ లో వచ్చిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'జైలర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. నెల్సన్ టేకింగ్, ఎలివేషన్స్ కు తోడు రజనీకాంత్ స్టైలిష్ నటన సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చింది. ఆ మూవీ కొనసాగింపుగా 'జైలర్2' రూపొందుతోంది. తొలి భాగంలో శివరాజ్కుమార్, మోహన్ లాల్ వంటి నటీనటులు సినిమాను మలుపుతిప్పే అతిథి పాత్రల్లో మెరిశారు. ఇప్పుడు అలాంటి పాత్రనే బాలకృష్ణ పోషించబోతున్నారని టాక్. 'జైలర్'లోనూ బాలకృష్ణను తీసుకుందామని తాను అనుకున్నట్లు నెల్సన్ ఓ సందర్భంలో చెప్పారు. అయితే, బాలకృష్ణకు ఉన్న ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని ఆ పాత్రను తీర్చిదిద్దలేకపోవడంతో ముందుకు వెళ్లలేదని అన్నారు. ఇప్పుడు నెల్సన్ ఆ పని పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు స్టార్స్ ఒకే ఫ్రేమ్ లో తెరపై కనిపిస్తే థియేటర్లు దద్దరిల్లిపోవాల్సిందే.



# శర్వానంద్ మాస్ సంభవం.. సంపత్ నందితో పాన్ ఇండియా 'భోగి'

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ కూడా ఒకరు. మరి తాను హీరోగా దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్ లో ఓ సాలిడ్ మాస్ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం నుంచి మేకర్స్ క్రేజీ అప్డేట్ ని అందించారు. దీనితో ఒక ఇంట్రెస్టింగ్ గ్లింప్స్ ని మేకర్స్ రివీల్ చేస్తూ శర్వానంద్ నుంచి కంప్లీట్ మాస్ షేడ్ ను ప్రెజెంట్ చేసారని చెప్పాలి. అలాగే దర్శకుడు సంపత్ నంది చూపించిన మాస్ కట్స్ మాత్రం అదిరాయని చెప్పాలి.

ఇక వీటితో పాటుగా ఈ చిత్రానికి భోగి అనే టైటిల్ ని మేకర్స్ రివీల్ చేయడం జరిగింది. నేటి నుంచే షూటింగ్ ని స్టార్ట్ చేసుకున్న ఈ చిత్రం విడుదలని మేకర్స్ పాన్ ఇండియా భాషల్లో కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతిలు హీరోయిన్స్ గా నటిస్తుండగా శ్రీ సత్య సాయి ఆరట్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మాణం వహిస్తున్నారు. ఇక ఈ సినిమాపై మరిన్ని డీటెయిల్స్ బయటకి రానున్నాయి.

# సత్తా చాటిన స్నేహ్, ప్రతీక .. దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు

ముక్కోణపు వన్డే సిరీస్లో భారత మహిళల జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆల్రౌండ్ ప్రదర్శనతో హర్మన్ప్రీత్ బృందం వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం 15 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. బౌలింగ్లో స్నేహ్‌రాణా (5/43).. బ్యాటింగ్లో ప్రతీక రావల్ (78; 91 బంతుల్లో 7స4, 1స6) టీమ్ఇండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. సఫారీ జట్టు ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ (109; 107 బంతుల్లో 13స4, 3స6) శతకం వృథా అయింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 5 వికెట్లకు 276 పరుగులు సాధించింది. ఫామ్ను కొనసాగించిన ఓపెనర్ ప్రతీక.. మొదటి వికెట్కు స్మృతి మంధాన (36; 54 బంతుల్లో 5స4)తో 83 పరుగులు జోడించి ఇన్నింగ్స్కు గట్టి పునాది వేసింది. హర్మన్ప్రీత్ (41), జెమీమా రోడ్రిగ్స్ (41), హర్లీన్ డియోల్ (29), రిచా ఘోష్ (24) తలో చేయి వేయడంతో భారత్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంలబా (2/55) రాణించింది. బదులుగా దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో బ్రిట్స్ జట్టును ముందుకు నడిపించింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (43)తో ఆమె తొలి వికెట్కు 140 పరుగులు జత చేయడంతో సఫారీ జట్టు లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. వోల్వార్ట్ను ఔట్ చేయడం ద్వారా దీప్తిశర్మ (1/40) ఈ జోడీని విడగొట్టింది. అయినా 33 ఓవర్లకు 170/2తో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితిలో నిలిచింది. భారత స్పిన్నర్లు విజృంభించడంతో ఆ జట్టు 80 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయి ఓటమి కొనితెచ్చుకుంది. ఆఫ్ స్పిన్నర్ స్నేహ్‌రాణా ఆ జట్టు పతనంలో కీలకపాత్ర పోషించింది. సెంచరీ చేసి జోరు మీద కనిపించిన బ్రిట్స్.. ఎండకు తాళలేక 33వ ఓవర్ తర్వాత రిటైర్ కావడం దక్షిణాఫ్రికాను దెబ్బ తీసింది. 48వ ఓవర్లో బ్రిట్స్ మళ్లీ బ్యాటింగ్కు వచ్చినా.. జట్టును గెలిపించలేకపోయింది. ఆమె తన స్కోరుకు ఒక్క పరుగే జోడించగలిగింది. 48వ ఓవర్ వేసిన స్నేహ్.. డిక్లెర్క్ (0), డెర్క్సెన్ (30)తో పాటు బ్రిట్స్ను ఔట్ చేసి అయిదు వికెట్ల ఘనతను పూర్తి చేయడమే కాక విజయాన్ని ఖాయం చేసింది.

సంక్షిప్త స్కోర్లు... భారత్: 276/6 (ప్రతీక 78, స్మృతి 36, హర్లీన్ 29, హర్మన్ప్రీత్ 41, జెమీమా 41; ఎంలబా 2/55) దక్షిణాఫ్రికా: 49.2 ఓవర్లలో 261 ఆలౌట్ (బ్రిట్స్ 109, వోల్వార్ట్ 43, డెర్క్సెన్ 30; స్నేహ్‌రాణా 5/43, దీప్తి 1/40, అరుంధతి 1/59, శ్రీచరణి 1/51)



# అక్కినేని కాదు మెగా నుంచి గుడ్ న్యూస్!?

మన టాలీవుడ్ సీనియర్ హీరోస్ మెగాస్టార్ చిరంజీవి అలాగే అక్కినేని నాగార్జునలు నడుమ స్నేహ బంధం ఏపాటిదో అందరికీ



తెలిసిందే. అయితే రీసెంట్ గానే అక్కినేని వారసుడు అక్కినేని నాగ చైతన్య అలాగే శోభితల నుంచి ఒక గుడ్ న్యూస్ అంటూ ఓ వార్త వైరల్ గా మారింది. ఇద్దరు యువ జంట తల్లిదండ్రులు కాబోతున్నట్టుగా టాక్ వినిపించింది.

అయితే ఇందులో ఎలాంటి నిజం లేదు అన్నట్టే తర్వాత కన్ఫర్మ్ అయ్యింది. కానీ అక్కినేని ఇంట నుంచి ఏమో కానీ మెగా ఇంటి నుంచి ఓ గుడ్ న్యూస్ వచ్చే ఛాన్స్ ఉన్నట్టు టాక్ వినిపిస్తుంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ అలాగే లావణ్య త్రిపాఠి కొణిదెలలు తల్లిదండ్రులు కానున్నట్టుగా అయితే ఇందులో ఎలాంటి నిజం లేదు అన్నట్టే తర్వాత కన్ఫర్మ్ అయ్యింది. కానీ అక్కినేని ఇంట నుంచి ఏమో కానీ మెగా ఇంటి నుంచి ఓ గుడ్ న్యూస్ వచ్చే ఛాన్స్ ఉన్నట్టు టాక్ వినిపిస్తుంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ అలాగే లావణ్య త్రిపాఠి కొణిదెలలు తల్లిదండ్రులు కానున్నట్టుగా ఇపుడు బజ్ వినిపిస్తోంది. దీనితో మెగా కుటుంబం నుంచి గుడ్ న్యూస్ త్వరలోనే అధికారికంగా ప్రకటన రావచ్చని టాక్. మరి దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

**ఆ డైరెక్టర్ తో వరుణ్ తేజ్ నెక్స్ట్ మూవీ..?**

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం తన కొత్త చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. దర్శకుడు మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో ఓ హారర్-కామెడీ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ ను మేకర్స్ పరిశీలిస్తున్నారు. ఇక ఈ సినిమా పూర్తి కాకముందే, తన నెక్స్ట్ మూవీని లైన్ లో పెట్టేందుకు సిద్ధమవుతున్నాడట.

ఈ క్రమంలోనే వరుణ్ తేజ్ తన నెక్స్ట్ మూవీ కోసం కథలు వింటున్నాడట. తాజాగా దర్శకుడు రాధాకృష్ణ వరుణ్ తేజ్ కు ఓ కథ వినిపించినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో రాధేశ్యామ్ చిత్రాన్ని తెరకెక్కించి భారీ డిజాస్టర్ అందుకున్నాడు ఈ డైరెక్టర్. అయితే, ఆ తర్వాత గోపీచంద్ తో ఓ సినిమా చేయాలని చూసినా, అది వర్కవుట్ కాలేదు.

ఇక ఇప్పుడు వరుణ్ తేజ్ తో తన నెక్స్ట్ మూవీని తెరకెక్కించాలని ఈ డైరెక్టర్ ప్లాన్ చేస్తున్నాడు. మరి వరుణ్ తేజ్ ఈ డైరెక్టర్కు గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా లేదా అనేది చూడాలి.

# పబ్లిసిటీ గురించి అసలు పట్టించుకోను: వెంకటేశ్

రజనీకాంత్ తోతనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పారు. అలాగే తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఓ సలహా ఇచ్చారని అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ సలహానే పాటిస్తున్నానన్నారు.

''రజనీకాంత్ కు, నాకు ఇద్దరికీ ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.



మా నాన్నతో కలిసి ఆయన వర్క్ చేశారు. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ సమయంలో బ్యానర్లు కట్టారా? పోస్టర్లలో మన ముఖం బాగా కనిపిస్తుందా? మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్లో మన ఫొటో వేశారా? ఇలాంటి వాటి గురించి ఆలోచించొద్దన్నారు. మన పని మనం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ అదే సలహాను పాటిస్తున్నాను. పబ్లిసిటీ గురించి పట్టించుకోను. దేని గురించి ఎక్కువగా ఆలోచించను'' అని వెంకటేశ్ చెప్పారు.

ఇక ఇదే ఇంటర్వ్యూలో వెంకటేశ్ తనకు అరుణాచలం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రమణ మహర్షిని ఆరాధిస్తానని తెలిపారు. చిన్నప్పటినుంచి ఆధ్యాత్మిక భావాలు ఎక్కువేనని చెప్పారు. దేవుడంటే భయం ఎక్కువని.. భగవంతుడికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివినట్లు తెలిపారు. 'ఘర్షణ' సమయంలో తాను ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని దేవుడి దయతోనే ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడినట్లు చెప్పారు.



# బుల్లితెర నటి ఏఐ వీడియోలు.. అసహ్యంగా ఉందన్న బ్యూటీ!

బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ నాగిని సీరియల్ తో సౌత్ లో ఫేమస్ అయింది. బాలీవుడ్ లో పలు సూపర్ హిట్ సీరియల్స్ లో నటించిన ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ది భూత్నీ అనే హారర్ మూవీలో కనిపించనుంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 1వ తేదీన థియేటర్లలో సందడి చేయనుంది.

ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మౌనీ రాయ్.. ఎక్కడికెళ్లినా తన ఫోటోలు, వీడియోలను అభిమానులతో షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ ముద్దుగుమ్మపై ఎప్పుడు ఏదో ఒక రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. గ్లామర్ కోసం చాలాసార్లు సర్జరీ చేయించుకుందని సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వచ్చాయి. ఆమె కాస్మెటిక్ సర్జరీ చేయించుకుందని.. దాన్ని కవర్ చేసేందుకు తన హెయిర్స్టైల్ను మార్చుకుందని నెటిజన్స్ విమర్శించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనపై వస్తున్న ట్రోల్స్పై బాలీవుడ్ భామ స్పందించింది. ఇలాంటి వారిని చూసినప్పుడు తనకు జాలేస్తుందని చెప్పుకొచ్చింది.

మౌనీ రాయ్ మాట్లాడుతూ.. 'నేను అలాంటి వ్యాఖ్యలను చదివినప్పుడు.. కొన్నిసార్లు ఏఐ వీడియోలను చూసినప్పుడు చాలా భయంకరంగా అనిపిస్తుంది. మీరు ఇతరులను అలా చూడటం ఎలా అనిపిస్తుందో ఒక్కసారి ఊహించుకోండి. నా ముఖాన్ని ఇతరుల శరీర ఆకృతిపకి జత చేసి వక్రీకరించడం చూస్తే అది చాలా అసహ్యంగా అనిపించింది. ఈ రకమైన వ్యక్తులు ఎక్కడికి వెళ్తున్నారు? దీంతో ఏమి సాధించాలనుకుంటున్నారు? వారి లక్ష్యం ఏమిటి? ఎందుకంటే మీరు చేస్తున్న దానితో ఎవరికీ ఉపయోగం లేదు. అలా చేస్తున్న వ్యక్తుల మంచిని ఎవరూ కోరుకోరు' అని తెలిపింది.

'మొదట సోషల్ మీడయాలోకి వచ్చినప్పుడు నా పట్ల చాలామందిలో ద్వేషం కలిగింది. అలాంటి వారి ప్రొఫైల్స్ను బ్లాక్ చేయడానికి ప్రయత్నిస్తాను. ఆ సమయంలో నాకు చాలా జాలిగా అనిపిస్తుంది. అలాంటి వారితి సరైన బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా. ఇలాంటి వ్యక్తులు లైక్ల కోసం ఏమైనా చేస్తారు. ఇతరుల గురించి చెత్తగా రాస్తూ ప్రచారం చేస్తారు. కానీ నా అభిమానుల నుంచి లభించే ప్రేమను ఎప్పటికీ తిరస్కరించలేను' అని చెబుతోంది బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.